
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు 5
శనివారం 20 సెప్టెంబరు 2025

అసంపూర్ణం



నిర్మాణంలో ఉన్న కళాశాల రెండో బిల్డింగ్

- నత్తనడకన నంద్యాల వైద్య కళాశాల నిర్మాణాలు
- ఇప్పటికి పూర్తయిన పనులు 27.5శాతం
- మొదలు కాని 31 నిర్మాణ పనులు
- అక్టోబరులో ముగియనున్న కాంట్రాక్టర్ గడువు
- కళాశాల వ్యయం రూ.475 కోట్లు
- ఇప్పటికే రూ.136 కోట్లు చెల్లింపు

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల నిర్మాణాలపై వైసీపీ చేసిన నిర్లక్ష్యం నేటికీ వెంటాడుతోంది. మెడికల్ కళాశాలల పేరిట వైసీపీ నాయకులు ఇప్పుడు నానా యాగీ చేస్తోంది. ఏడాదిన్నర క్రితం వరకూ అధికారంలో ఉన్న వైసీపీ అప్పుడు భవన నిర్మాణాలు పూర్తి చేయకపోవడంతో ఇప్పుడు విద్యార్థుల పాలిట శాపంగా మారింది. ఇన్నేళ్లకు గాను నంద్యాల వైద్య కళాశాల భవన నిర్మాణాల పనులు కేవలం 27.5 శాతం మాత్రమే పూర్తయింది. కళాశాల ప్రాజెక్టులో 40 నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా ఐదు నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో నాలుగు నిర్మాణ దశలో ఉన్నాయి. 31 నిర్మాణాలు అసలే ప్రారంభించలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన మెడికల్ కళాశాలలు రాష్ట్రవ్యాప్తంగా ఐదు కళాశాలలు మాత్రమే ప్రారంభించారు. నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నా విద్యాసంవత్సరం ప్రారంభమవడంతో గత ప్రభుత్వం ఆగమేఘాలపై వైద్య కళాశాలలను ప్రారంభించింది. నంద్యాల మెడికల్ కాలేజీలకు రూ.475కోట్లు వెచ్చించాల్సి ఉండగా ఇప్పటివరకు జరిగిన నిర్మాణాలకు రూ.136కోట్లు కాంట్రాక్టర్‌కు చెల్లించింది. ప్రస్తుతం కళాశాలలో ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యాసంవత్సరానికి అనుగుణంగా నిర్మాణాలు చేపడుతూ విద్యార్థులకు, సిబ్బందికి ఇబ్బందిలేకుండా కాంట్రాక్టర్ నిర్మాణాలు చేస్తున్నారు. గత ఎన్నికల తర్వాత ఏడు నెలలు నిధులురాక బిల్లులు చెల్లించక పనులు నత్తనడకన సాగాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ మెడికల్ కాలేజీకి రూ.57 కోట్ల బిల్లులు చెల్లించింది. గత వైసీపీ ప్రభుత్వం రూ.79 కోట్లు నిధులు విడుదల చేసింది. ప్రతి ఏటా కొత్త నిర్మాణాలు చేపడుతూ సుదీర్ఘకాలంగా పూర్తయ్యే పరిస్థితి నెలకొంది. బిల్లులు సక్రమంగా చెల్లిస్తే ఐదేళ్లలోపు నిర్మాణాలన్నీ పూర్తిచేసే అవకాశం ఉంది. కాగా ఈ ఏడాది అక్టోబరులో కాంట్రాక్టర్ గడువు ముగియనుంది. ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టైం (ఈవోటీ) ద్వారా మరింత గడువు తీసుకునేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపేందుకు సిద్ధంగా ఉన్నారు. విజయవాడకు చెందిన ఏఎంవీ నిర్మాణ సంస్థ నంద్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలను నిర్మిస్తోంది.

పూర్తయినవి

నంద్యాల మెడికల్ కాలేజీలో కళాశాల భవనం, బాలికల, బాలుర హాస్టల్ భవనాలు, సబ్‌స్టేషన్, ఎంట్రెన్స్‌గేట్, కాంపౌండ్‌వాల్ పనులు

నిర్మాణ దశలో ఉన్నవి

మరో కాలేజీ భవనం, బాల, బాలికల హాస్టల్ భవనాలు, కామన్ డైనింగ్‌హాల్, ఇంటర్నల్‌రోడ్లు, డ్రైన్లు పనులు

ఇంకా మొదలు కానివి

మెడికల్ కాలేజీకి సంబంధించి సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్, సిబ్బంది క్వార్టర్స్, హాస్టల్, హాస్పిటల్‌కు సంబంధించిన పలు విభాగాల బ్లాకులు అసలు మొదలేకాలేదు. దీంతో ప్రస్తుతం విద్యార్థులకు ఇబ్బంది లేకుండా జీజీహెచ్‌ను వాడుకుంటున్నారు.



అసంపూర్తిగా ఎగ్జామ్ హాల్ భవనం

22 నుంచి మొదటి సంవత్సరం తరగతులు

నంద్యాల మెడికల్ కాలేజీలో ఈ నెల 22 నుంచి మొదటి సంవత్సరం క్లాసులు ప్రారంభమవుతాయి. ప్రస్తుతం కళాశాలలో విద్యార్థులకు తగ్గట్లుగా వసతులున్నాయి. 142 మంది బాలికలు, 122 మంది బాలురు హాస్టల్‌లో ఉంటున్నారు. ఈఎన్‌టీ విభాగానికి ప్రొఫెసర్ లేరు. నిర్మాణాలు పూర్తయితే రెండు ఎగ్జామ్‌హాళ్ల, రెండు లెక్చరర్ గ్యాలరీలు, మ్యూజియం, జిమ్ ఏర్పాటు చేసుకోవచ్చు. క్రిమికల్ లెక్చరర్ హాల్ సిద్ధంగా ఉంది. ఫర్నీచర్ రావాల్సి ఉంది. మెడికల్ కాలేజీలో 19 డిపార్ట్‌మెంట్లకు సంబంధించిన ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు. విద్యాసంవత్సరానికి అనుగుణంగా నియామకాలు కూడా చేపడుతున్నాం. జీ ప్లస్ సిక్స్ హాస్టల్ భవనంలో రూమ్‌కు ముగ్గురిని కేటాయిస్తున్నాం.

● డాక్టర్ సురేఖ, ప్రిన్సిపాల్, నంద్యాల మెడికల్ కాలేజీ

మార్చికి 40శాతం పూర్తవుతుంది

నంద్యాల మెడికల్ కాలేజీ నిర్మాణాలు మార్చినాటికి దాదాపు 40శాతం పూర్తవుతుంది. ప్రతిఏటా కొత్త నిర్మాణాలు ప్రారంభించి అవి పూర్తయిన తర్వాత వేరే నిర్మాణాలు చేపడుతున్నాం. సకాలంలో బిల్లులు కాంట్రాక్టర్‌కు చెల్లిస్తున్నాం. ఇదేవిధంగా నిర్మాణాలు కొనసాగితే ఐదేళ్లలో మెడికల్ కాలేజీ నిర్మాణాలన్నీ పూర్తయ్యే అవకాశం ఉంది. కాంట్రాక్టర్ గడువు ముగుస్తున్న నేపథ్యంలో ఈవోటీకి ప్రతిపాదనలు పంపాం.

● నర్సింహారెడ్డి, ఈఈ

దసరా ఉత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం



కలెక్టర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న శ్రీశైలం దేవస్థానం అధికారులు, వేదపండితులు

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో ఈనెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జరిగే దసరా మహోత్సవాలకు రావాలని శ్రీశైల దేవస్థానం అధికారులు, అర్చకులు కలెక్టర్ రాజకుమారికి ఆహ్వానం పలికారు. శ్రీశైల దేవస్థానం ఏఈవో, ఆలయ అర్చకులు శుక్రవారం నంద్యాల కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం దేవస్థానం వేదపండితులు కలెక్టర్‌ను ఆశీర్వదించారు.

జనజీవనం.. అతలాకుతలం

- పొలాల్లో ప్రవహిస్తున్న వరద
- 1,500 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు



బెండపంట పొలంలో ప్రవహిస్తున్న వరద నీరు

చాగలమర్రి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షంతో నేలంపాడు గ్రామంలో వరద నీరు చేరి జనజీవనం అతలాకుతలమైంది. పొలాల్లో వరద ప్రవహిస్తూనే ఉంది. గృహాల్లోకి ప్రవేశించిన నీరు తగ్గకపోవడంతో బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వ అధికారులు ఎలాంటి వరద సహాయక చర్యలు చేపట్టడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. వరద నీటిలో అల్లాడుతున్న పట్టించుకోకపోవడం బాధాకరమని మహిళలు వాపోతున్నారు. నేలంపాడు, గొట్లూరు, జంగాలపల్లె, కొట్టాలపల్లె, రాంపల్లె గ్రామాల సమీపంలోని పొలాల్లో కూడా వరద నీరు తగ్గలేదు. బెండ, మినుము, కంది, మొక్కజొన్న, జూట్ పంటలు నీట మునిగి కుళ్లిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. 1,500 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. పొలాలు నీట మునిగిన వ్యవసాయ శాఖ కన్నెత్తి కూడా చూడలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పంట నష్టం అంచనా వేసి పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

నాడు క్వింటా రూ.2వేలు నేడు రూ.500

- భారీ వర్షాలతో దెబ్బతిన్న ఉల్లి పంట
- ఇళ్ల వద్దనే ఆరబెట్టుకుంటున్న రైతులు



చిన్నవంగలిలో తడిచిన ఉల్లిని కూలర్‌తో ఆరబెడుతున్న దృశ్యం

చాగలమర్రి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉల్లిని పండించే రైతులకు ధర లేక కన్నీరు పెట్టిస్తోంది. నాడు క్వింటా ధర రూ.2వేలు పలకగా నేడు క్వింటా రూ.500 పలుకుతోంది. దీంతో రైతులకు లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లిందని ఆవేదన చెందుతున్నారు. మండలంలోని చిన్నవంగలి, పెద్దవంగలి, శెట్టివీడు, నేలంపాడు గ్రామాల్లో 300ఎకరాల దాకా ఉల్లిని సాగు చేశారు. చిన్నవంగలి గ్రామంలోనే 70 ఎకరాలకు పైగా ఉల్లిని పండించారు. ఎకరాకు రూ.50వేలు నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టారు. పంట కోత సమయంలో ధర పతనమైంది. ధర లేక అల్లాడుతున్న రైతులకు భారీ వర్షంతో ఉల్లి అతలాకుతలం చేసింది. కోతకు వచ్చిన ఉల్లిగడ్డలు తడిచి దెబ్బతిన్నాయి. కోత కోసిన ఉల్లిగడ్డలు ఆరబెట్టుకునేందుకు గోదాములు లేక గృహాలు, సత్రాల్లో ఆర బోసుకుంటున్నారు. చిన్నవంగలి గ్రామంలో శ్రీరామ్‌రెడ్డి అనే రైతు తడిచిన ఉల్లిగడ్డలను ఆరబెట్టుకునేందుకు కూలర్ ఏర్పాటు చేసుకున్నాడు. ఉల్లిగడ్డలు ఆరితే కోత కోసిన కూలీల డబ్బులు వస్తాయన్న ఆశతో ఇలా చేస్తున్నట్లు తెలిపారు. ఉల్లి కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదని అన్నారు. ప్రభుత్వం స్పందించి ఉల్లిగడ్డలకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

నిర్భయంగా ఫిర్యాదు చేయండి

● ఎస్పీ సునీల్ షెరాన్



డీఎస్పీతో మాట్లాడుతున్న ఎస్పీ

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అన్యాయం జరిగితే ప్రజలు నిర్భయంగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సునీల్ షెరాన్ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆళ్లగడ్డలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్, రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి, ఎస్ఐ వరప్రసాద్‌లు ఎస్పీకు ఘనస్వాగతం పలికారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను, స్టేషన్ ఆవరణం, సిబ్బంది పనితీరు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల బారినపడి ప్రజలు నష్టపోకుండా పోలీసు శాఖ ప్రజలకు అవగాహన కల్పిస్తుందన్నారు. నియోజకవర్గ పరిధిలో పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకొని, త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఆళ్లగడ్డ పరిధిలో జాతీయ రహదారి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శిరివెళ్ల రూరల్ పోలీస్‌స్టేషన్‌ను కూడా ఎస్పీ తనిఖీ చేశారు.


మల్లన్న సేవలో చైర్మన్ రమేశ్ నాయుడు



చైర్మన్‌కు స్వాగతం పలుకుతున్న ప్రజా సంబంధాల అధికారి

శ్రీశైలం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): భ్రమరాంబ, మల్లికార్జున స్వామిని శుక్రవారం శ్రీశైల దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పోతుగుంట రమేశ్ నాయుడు దర్శించుకున్నారు. ముందుగా నూతన చైర్మన్‌కు దేవస్థానం ప్రజా సంబంధాల అధికారి శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. చైర్మన్‌గా రమేశ్ నాయుడుకు అవకాశం కల్పించడంతో కృతజ్ఞతగా బీజేపీ నాయకులు గంగాధర మండపం వద్ద కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం చైర్మన్ స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. తదుపరి ఆలయ ప్రాకార మండపంలో వేదపండితులు వేద ఆశీర్వచనం పల్లించగా, అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయాధికారులు స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి ప్రసాదంతో పాటు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం నందినికేతన్ అతిథి గృహం వద్ద రమేశ్ నాయుడు విలేకరులతో మాట్లాడుతూ శ్రీశైలం దేవస్థానం చైర్మన్‌గా ఎన్నిక చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, వైద్య శాఖమంత్రి సత్యకుమార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పదవీ స్వీకారం అనంతరం శ్రీశైల క్షేత్ర అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించనున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.

రెవెన్యూలో వసూల్ రాజా



- అక్కడ అతడి మాటే వేదం.. చెప్పిందే శాసనం
- గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1 వీఆర్వోగా పదోన్నతులకు ముడుపులు
- ఒక్కొక్కరి నుంచి రూ.10 వేల నుంచి రూ.30వేల వరకు వసూలు
- గ్రేడ్-1వీఆర్వోలు అనధికారికంగా ఆర్ఐలుగా చెలామణి
- విధులు నిర్వహించకుండానే వేతనాలు
- కర్నూలు కలెక్టరేట్‌లో చక్రం తిప్పుతున్న ఏ-సెక్షన్‌లోని డీటీ

అన్ని ప్రభుత్వ శాఖల్లో కన్నా రెవెన్యూ శాఖ అత్యంత కీలకమైనది. పరిపాలన విభాగంలో కూడా రెవెన్యూ శాఖ గుండెకాయ లాంటిది. కానీ కర్నూలు జిల్లా కలెక్టరేట్‌లో పని చేసే కొందరు రెవెన్యూ ఉన్నతాధికారులు, ఉద్యోగుల వల్ల జిల్లాలో రెవెన్యూ శాఖ అస్తవ్యస్తంగా మారింది. కూటమి ప్రభుత్వం గ్రేడ్-2 వీఆర్వోలకు గ్రేడ్-1 వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించనుంది. దీనిపై గ్రేడ్-2 వీఆర్వో ఒక్కరు దృష్టి పెట్టాడు. వసూలుకు తెర లేపాడు. ఒక్కొక్కరి నుంచి రూ.10వేల నుంచి రూ.30వేలు వసూలు చేశాడు. సదరు అధికారికి కలెక్టరేట్‌లోని ఏ-సెక్షన్‌కు చెందిన ఓ డీటీ అండదండలు ఉన్నాయి. ఇటీవలే ఆ గ్రేడ్-2 వీఆర్వోను కలెక్టర్ కార్యాలయ సమీపంలోని ఓ సచివాలయానికి ఆ డీటీనే బదిలీ చేయించినట్లు తెలిసింది. ఆ వీఆర్వో మాటే వేదం.. చెప్పిందే శాసనంగా కొనసాగుతోంది. వీరిద్దరూ కలిసి రెవెన్యూ శాఖను శాసిస్తున్నారు.

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాకు చెందిన రెవెన్యూ శాఖలో జరుగుతున్న పదోన్నతులపై వసూల్ రాజా దృష్టి పెట్టాడు. ప్రభుత్వం అన్ని శాఖల్లో పదోన్నతుల ప్రక్రియకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా జిల్లాలో 150మంది గ్రేడ్-2 వీఆర్వోలకు గ్రేడ్-1 వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించనుంది. నగరంలోని కలెక్టరేట్ సమీపాన గల సచివాలయంలో పని చేస్తున్న ఒక గ్రేడ్-2 వీఆర్వో పదోన్నతులు పొందుతున్న కొంతమంది వీఆర్వోలతో ఒక్కొక్కరి నుంచి రూ.10వేలు నుంచి రూ.30వేల వరకు వసూలు చేశాడు. ఇటీవల గ్రేడ్-2 వీఆర్వో బదిలీలలో కలెక్టరేట్‌లోని ఏ-సెక్షన్‌లో పని చేస్తున్న ఏ-1 డిప్యూటీ తహసీల్దార్ వసూల్ రాజా గ్రేడ్-2 వీఆర్వోకు కలెక్టరేట్ సమీపాన సచివాలయంలో పోస్టింగ్ ఇప్పించాడు. ప్రస్తుతం ఆగ్రేడ్-2 వీఆర్వో కలెక్టరేట్ రెవెన్యూ కార్యాలయాన్ని శాసిస్తున్నాడు. డీఆర్వో కార్యాలయంలో పని చేసే రెవెన్యూ అధికారులు కలెక్టరేట్‌లో జరిగే చిన్న కార్యక్రమాలకు కూడా మండల స్థాయి నుంచి రూ.15వేలు ఇటీవల వసూలు చేశారు.

ఏ సెక్షన్‌లోని ఏ1 డీటీ నుంచి..

కలెక్టరేట్‌లోని రెవెన్యూ కార్యాలయంలో ఏఫైల్ అయినా ఏసెక్షన్‌లోని ఏ1 డిప్యూటీ తహసీల్దార్(డీటీ) అనుమతి లేనిదే కదలని పరిస్థితి నెలకొంది. ఇక్కడ నామమాత్రపు అధికారిక హోదాలో కలెక్టరేట్ పరిపాలన అధికారి కొనసాగడం కొసమెరుపు. వసూల్‌రాజా గ్రేడ్-2 వీఆర్వోకు ఏ-1 డీటీలు అండదండలు ఉన్నాయని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. కొన్ని అధికారిక ఫైల్ సైతం ఏ-1 డీటీ కనుసైగల్లో పరిష్కారం అవుతున్నాయి.

గ్రేడ్-1 వీఆర్వోలు..

జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయంలో గ్రేడ్-1 వీఆర్వోలు అనధికారికంగా మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు(ఆర్ఐ)గా చెలామణి అవుతున్నారు.

మిగతా 6వ పేజీలో

జాతీయ స్థాయి ఫైరింగ్‌లో ప్రతిభ

● మొదటి స్థానంలో నిలిచిన కర్నూలు ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఫైరింగ్ విభాగంలో ఎండీ నాగరాజు మొదటి స్థానం పొందారు. శుక్రవారం ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని ప్రిన్సిపాల్ ఇందిరా శాంతి అభినందించారు. ఆమె మాట్లాడుతూ బీకాం 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థి న్యూఢిల్లీలో నిర్వహించిన థల్ సైనిక్ క్యాంప్‌లో పాల్గొని, ఫైరింగ్ విభాగంలో మొదటి స్థానం కైవసం చేసుకున్నారని తెలిపారు. ఎన్‌సీసీ క్యాడెట్‌గా కొనసాగుతూ పలు రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహించిన క్యాంపుల్లో పాల్గొని బహుమతులను అందుకున్నారు. ఏపీ, తెలంగాణ, రాష్ట్ర స్థాయి ఎయిర్ కమాండర్ ఆఫీసర్ శ్రీనర్సింగ్ సైలనీ, వైస్ ప్రిన్సిపాల్ జె.హేమంత్ ఎ.సత్యనారాయణ, డాక్టర్ డి.నాగన్న, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెవెన్యూలో వసూల్ రాజా

5వ పేజీ తరువాయి

జీవో.నెం.154 ప్రకారం గ్రేడ్-1 వీఆర్వోలకు 2021లో సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించారు. ఈమేరకు జిల్లాలో 50 మంది పదోన్నతులు పొందారు. సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందిన వారు 154 జీవోలోని రూల్.నెం.-4(సీ) ప్రకారం సీపీటీ, సర్వే పరీక్షలను రెండేళ్లలోపు కచ్చితంగా ఉత్తీర్ణత పొందాలి. ఉత్తీర్ణత సాధించని రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్లు తిరిగి యధాస్థానంగా గ్రేడ్-1 వీఆర్వోలుగా కొనసాగాలి. జిల్లాలో దాదాపు ప్రభుత్వ నిబంధనల ప్రకారం సీపీటీ సర్వే పరీక్షల ఉత్తీర్ణతకాని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు 11 మంది ఉన్నారు. వీరు రెవెన్యూ శాఖలోని అధికారుల అండదండలు ఉండటంతో నేటికీ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐలుగా కొనసాగుతుండటం కొసమెరుపు. రెవెన్యూ అధికారులు ప్రశ్నించకపోవడంతో అనధికారిక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఇష్టానురాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఉత్తీర్ణత సాధించని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను తొలగిస్తే జిల్లాలోని సీపీటీ, సర్వే పరీక్షలు ఉత్తీర్ణత పొందిన కిందిస్థాయి గ్రేడ్-1 వీఆర్వోలకు పదోన్నతులు లభించే అవకాశం ఉంది.

విచారణ జరిపిస్తాం



ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాం. అనధికారికంగా చెలామణి అవుతున్న మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను తొలగిస్తాం. మ్యాపింగ్, బయోమెట్రిక్ లేని వారికి త్వరలో మ్యాపింగ్, బయోమెట్రిక్ కల్పిస్తాం.

● వెంకట నారాయణమ్మ, డీఆర్వో, కర్నూలు

40 మంది గ్రేడ్-1 వీఆర్వోలు..

ప్రభుత్వం ఇటీవల జీవోఎంఎస్.నెం.4ను విడుదల చేసింది. దీని ప్రకారం రెండు, లేదా మూడు సచివాలయాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేశారు. ఒక క్లస్టర్‌కు ఒక వీఆర్వో విధులు నిర్వహిస్తారు. మున్సిపాలిటీల్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దాదాపు 40మంది గ్రేడ్-1వీఆర్వోలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఏదో ఒక సచివాలయంలో విధులు నిర్వహించకుండా గాలిలో తిరుగుతూ నెల నెలా జీతాలు తీసుకుంటూ ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారు. మున్సిపాలిటీల్లో గ్రేడ్-2 వీఆర్వోలకు కమిషనర్ డీడీవోగా ఉంటారు. గ్రేడ్-1 వీఆర్వోలకు సంబంధిత తహసీల్దార్ డీడీవోగా వ్యవహరిస్తారు. మున్సిపాలిటీలలో పనిచేసే గ్రేడ్-1 వీఆర్వోలకు ఎటువంటి మ్యాపింగ్‌గానీ, బయోమెట్రిక్ గానీ లేకపోవడంతో తహసీల్దార్ కార్యాలయాలకు హాజరు కావడం లేదనే ఆరోపణలున్నాయి. డీఆర్వో కార్యాలయంలో పనిచేసే వివిధ సెక్షన్లలో పనిచేసే రెవెన్యూ అధికారులు సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలను ఇబ్బంది కలగజేస్తున్నారు. సమస్యలపై రెవెన్యూ ఉన్నతాధికారులకు తెలియజేస్తే ఇక్కడ నేను చెప్పేదే వేదం.. నా మాటే శాసనమని ఒక రెవెన్యూ ఉన్నతాధికారి చెప్పడం కొసమెరుపు.

అక్కినేనికి అక్షరాలతో చిత్రాంజలి

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేశ్ అక్కినేని నాగేశ్వరరావు జయంతి సందర్భంగా ఎ3 సైజు డ్రాయింగ్ చార్ట్ మీద పెన్నుతో డ్రాయింగ్ వేశారు. అక్కినేని నటించిన 250





250 సినిమా పేర్లు, అవార్డుల పేర్లతో అక్కినేని నాగేశ్వరరావు చిత్రం

సినిమా పేర్లతో, ఆయన జీవిత చరిత్రలోని ముఖ్యమైన అంశాలతో, అలాగే ఆయన అందుకు అవార్డుల పేర్లకు సంబంధించి తెలుగు అక్షరాలతో అక్కినేని చిత్రాన్ని వేశారు. ఇలా కోటేశ్ తన చిత్రంతో నాగేశ్వరరావుకు నివాళి అర్పించారు.

సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

● ఉరి తాళ్లకు వేలాడుతూ వీఆర్‌ఏల నిరసన

నందికొట్కూరు రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): సమస్యలను తక్షణమే పరిష్కరించాలని గ్రామ రెవెన్యూ సేవకులు డిమాండ్ చేశారు. నందికొట్కూరులోని తహసీల్దార్ కార్యాలయం గ్రామ సేవకులు దీక్షా శిబిరం వద్ద ఉరితాళ్లకు వేలాడుతూ వినూత్నంగా నిరసన చేపట్టారు. గ్రామ రెవెన్యూ సేవకుల సంఘం జిల్లా నాయకులు మహేశ్, శివన్న, దర్గయ్య మాట్లాడుతూ తమను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేయాలని, అలాగే అర్హులైన వీఆర్‌ఏలకు వీఆర్వోలుగా, అటెండర్లుగా, వాచ్‌మన్లుగా, డ్రైవర్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. నామినీలుగా ఉంటూ వీఆర్‌ఏలుగా పనిచేస్తున్న వారిని గ్రామ రెవెన్యూ సహాయకులుగా క్రమబద్ధీకరించాలని, లేకపోతే పెద్దఎత్తున నిరసనలు తెలుపుతామన్నారు. కార్యక్రమంలో మాధవి, రంగస్వామి, శ్రీనివాసులు, మహేశ్వరుడు, సుజాత, సుధాకర్, వివిధ గ్రామాల నుంచి వచ్చిన గ్రామ రెవెన్యూ సేవకులు పాల్గొన్నారు.



నందికొట్కూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉరితాళ్లకు వేలాడుతూ నిరసన తెలుపుతున్న వీఆర్‌ఏలు

పత్తి ధర క్వింటా రూ. 7,659

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డు శుక్రవారం తెల్ల బంగారంతో కళకళలాడింది. ఖరీఫ్ సీజన్‌లో సాగైన పత్తి చేతికి అందడంతో రైతులు విక్రయించుకునేందుకు కొత్త పత్తిని భారీగా తీసుకొచ్చారు. పత్తి ధర ఆశాజనకంగా ఉండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కొత్త పత్తి మార్కెట్‌కు రావడంతో దుకాణాల ముందు కమీషన్ ఏజెంట్లు పూజలు చేసి విక్రయాన్ని ప్రారంభించారు. రైతులు ఇంటి వద్దే పత్తిని బాగా ఆరబెట్టు కొని విక్రయానికి తీసుకురావాలని మార్కెట్ యార్డ్ కార్యదర్శి గోవింద్ సూచించారు. 7,587 క్వింటాళ్ల పత్తి మార్కెట్ యార్డ్‌కు విక్రయానికి రాగా క్వింటాలు గరిష్ఠ ధర రూ.7,659, మధ్యస్థం రూ.7,389, కనిష్ఠం రూ. 4,019 పలికింది.

దసరా ఉత్సవాలకు నారా లోకేశ్‌కు ఆహ్వానం



మంత్రి నారా లోకేశ్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, ఈవో శ్రీనివాసరావు

శ్రీశైలం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో జరిగే దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు రావాలని మంత్రి నారాలోకేశ్‌ను ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, ఈవో శ్రీనివాసరావు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రికను అందించారు. ఈనెల 22నుంచి అక్టోబరు 2 వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు హాజరుకావాలని కోరారు. అనంతరం శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

వేటకొచ్చారు..!

● కృష్ణా తీరానికి చేరుకున్న మత్స్యకారులు
● వైజాగ్, కాకినాడ నుంచి వస్తున్న జాలర్లు
● నది సమీపంలో గుడారాలు ఏర్పాటు

పగిడ్యాల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): చేపల వేటకు సమయం ఆసన్నమైంది. కృష్ణా నదిలో చేపల వేట కొనసాగించేందుకు దళారీ మత్స్యకారులు సిద్ధమౌతున్నారు. విశాఖపట్నం, కాకినాడ నుంచి మత్స్యకారులు వాహనాలలో చేపల వల, బోట్లతో శుక్రవారం నెహ్రూనగర్ సమీపంలోని కృష్ణా నదీతీరానికి చేరుకున్నారు. అక్కడి నుంచి నది సమీపంలోని చట్టుపక్కల ప్రాంతాల్లో గుడారాలు ఏర్పాటు చేసుకొని నిషేధిత వలలతో వేట కొనసాగిస్తారు. ప్రతి ఏటా నెహ్రూనగర్, ప్రాతకోట, ముచ్చుమర్రి గ్రామాలకు చెందిన కొంతమంది దళారులు నదిలో చేపలను పట్టేందుకు విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడకు చెందిన మత్స్యకారులతో ఒప్పందం చేసుకుంటారు. కొంతమంది కూలీలను ఇక్కడికి తీసుకువచ్చి చేపలు పట్టి ఇతర ప్రాంతాలకు తరలిస్తారు. నదిలో నీరు తగ్గిపోయినప్పుడు నదీతీర ప్రాంతాలకు చెందిన లైసెన్సు కలిగిన మత్స్యకారులు డిసెంబరు, జనవరి నెలలో చేపల వేట కొనసాగించి జీవనం సాగిస్తారు. దళారీ మత్స్యకారులు రెండు నెలల ముందుగానే ఇక్కడికి వచ్చి నిషేధిత వలలతో వేట సాగించడంతో మత్స్యసంపద తగ్గిపోయ్యే ప్రమాదం ఉందని లైసెన్స్‌లు కలిగిన మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని దళారీ మత్స్యకారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వాహనాల్లో ఇంజన్‌బోటు తీసుకొని చేపల వేటకు వస్తున్న మత్స్యకారులు

మాతాశిశు మరణాలను అరికట్టాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాతా-శిశు మరణాలను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మొదటి త్రైమాసికంలో జరిగిన మాతా-శిశుమరణాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏ ఒక్క మరణం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వైద్య, స్త్రీ శిశు సంక్షేమ అధికారులను ఆదేశించారు. ప్రతి గర్భిణి సురక్షిత ప్రసవానికి హామీ ఇవ్వడం, శిశువుల ఆరోగ్య రక్షణ కల్పించడం వైద్య, శిశుసంక్షేమశాఖలు ప్రాధాన్యం ఇచ్చి వైద్య సేవలు అందించాలన్నారు. జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఒక మాతృ మరణం, మూడు శిశు మరణాలు జరగడం విచారకరమన్నారు. కుటుంబ సభ్యులకు అవసరమైన జాగ్రత్తలపై అవగాహన కల్పించకపోవడం వల్లనే మరణాలు సంభవిస్తున్నాయన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో వెంకటరమణ, స్త్రీ, శిశు సంక్షేమ అధికారి లీలావతి, డీసీహెచ్‌ఎస్ ఓ.లలిత, డీఐవో సుదర్శన్‌రావు పాల్గొన్నారు.

22 నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



కొత్తపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలనుభారతి పుణ్యక్షేత్రంలో దసరా దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రామలింగారెడ్డి శుక్రవారం తెలిపారు. ఈవో మాట్లాడుతూ ఈ నెల 22న బాలత్రిపుర సుందరీదేవి అలంకరణలో అమ్మవారు దర్శనం ఇస్తారని చెప్పారు. 23న గాయత్రీదేవి, 24న అన్నపూర్ణ దేవి, 25న కాత్యాయనీ అమ్మవారుగా, 26న మహాలక్ష్మీదేవి, 27న లలితా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిస్తారని తెలిపారు. 28న మహా చండీ దేవి, 29న సరస్వతీదేవి (మూల నక్షత్రం), 30న దుర్గాదేవి అలంకరణ, అక్టోబరు 1న మహిషాసుర మర్దిని దేవి, 2వ తేదీ రాజరాజేశ్వరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇస్తారని చెప్పారు. రోజూ అమ్మవారికి నూతన వస్త్రాలంకరణతో పాటు ప్రత్యేక పూజలు, చిన్నారులకు అక్షరాభ్యాస క్రతువులు ఉంటాయని తెలిపారు.

నందవరం చౌడేశ్వరి ఆలయంలో...



బనగానపల్లె, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నందవరం గ్రామంలో వెలసిన కాశీవిశాలాక్షి ప్రతి రూపం చౌడేశ్వరిదేవి ఆలయంలో ఈనెల 22వ తేదీ నుంచి అక్టోబరు నెల 2వ తేదీ వరకు దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. 22వ తేదీన శైలపుత్రికగా, 23న బ్రహ్మచారిణిగా, 24న చంద్రఘంట అలంకారం 25న కూష్మాండదేవి, 26న స్కందమాత, 27న కాత్యాయినిదేవి, 28న కాళరాత్రిదేవి, 29న మహాగౌరి, 30న మహాదుర్గదేవి, అక్టోబరు నెల 1వ తేదీన సిద్ధిధాత్రిదేవి, 2వ తేదీన చౌడేశ్వరిదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు.

దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం

మహానంది ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి



మహానంది, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు మహానంది ఆలయం ముస్తాబైంది. శివకామేశ్వరీ అమ్మవారికి దసరా సందర్భంగా ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాస రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ఉత్సవాల ఏర్పాట్లపై ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. 22 నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు దసరా ఉత్సవాలు కొనసాగుతాయి. మొత్తం పదకొండు రోజుల పాటు మహానందిలో ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. 22న తొలి రోజు అమ్మవారు బాల త్రిపుర సుందరిదేవిగా దర్శనమిస్తారు. 23న మహాగౌరి, 24న అన్నపూర్ణేశ్వరి, 25న రాజరాజేశ్వరీ, 26న లలిత త్రిపురసుందరిదేవి, 27న మహాలక్ష్మీ,28న గాయత్రి, 29న సరస్వతీ దేవి, 30న మహిషాసురమర్థిని, అక్టోబరు 1న కామేశ్వరీదేవి, 2న శివ కామేశ్వరీదేవి అలంకరణలో అమ్మవారి దర్శనం ఉంటుంది. ప్రతి రోజు అమ్మవారి ప్రధాన ఆలయంలో అర్చకులు ప్రాతఃకాల పూజలతో పాటు కుంకుమార్చన, యాగశాల మండపంలో హోమాలు తదితర కైంకర్యాలు నిర్వహిస్తాం. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ ఏడాది ప్రత్యేకంగా ఆలయ ప్రధాన గోపురాలకు ప్రాకార మండపాలకు విద్యుద్దీపాలతో అలంకరించాం. అమ్మవారికి ప్రత్యేక పూల అలంకరణ కోసం చిత్తూరు జిల్లా అంబూరు నుంచి ప్రత్యేకంగా పిలిపించి టెండర్ ప్రక్రియ ద్వారా కాంట్రాక్ట్ పనులను అప్పగించాం. ప్రతిరోజు అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకార దర్శనంతో పాటు సాయంత్రం సహస్రదీపాలంకరణ సేవ, గ్రామోత్సవం, ఉత్సవం ముందు చిన్నారుల కోలాటం, భరతనాట్యంతో పాటు కాలక్షేపం కోసం హరికథ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, భజనలను ఏర్పాటు చేశాం. దసరా పర్వదినం రోజున అమ్మవారి నిజరూప అలంకరణతో దర్శనం కల్పిస్తూ మహానంది పురవీధుల్లో గ్రామోత్సవం, క్షేత్రానికి సమీపంలోని ఈశ్వర్‌నగర్ కాలనీలోని జమ్మి చెట్టు వద్ద శమీ పూజను నిర్వహిస్తామని ఈఓ తెలిపారు.

మేళిగనూరులో కీరవాణి సందడి

● రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



మేళిగనూరు యువకులతో మాట్లాడుతున్న కీరవాణి

కౌతాళం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో తుంగభద్ర ముఖద్వారమైన మేళిగనూరులో శుక్రవారం ప్రముఖ సినిమా సంగీత దర్శకుడు ఎం.ఎం కీరవాణి సందడి చేశారు. తుంగతీరాన శ్రీరాముడు ప్రతిష్ఠించిన దేవాలయం శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయంను సందర్శించి స్వామి వారికి పూజలు చేశారు. కీరవాణి వచ్చిన విషయం తెలుసుకున్న గ్రామ యువకులు అక్కడికి చేరుకుని ఆయతో ఫొటోలు తీసుకునేందుకు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా కీరవాణి మాట్లాడుతూ చిన్నప్పుడు తాము ఈ ప్రాంతంలో నివసించామన్నారు. తాను కూడా ఇక్కడ సొంత ఖర్చుతో ఆంజనేయ స్వామి దేవాలయంను నిర్మించినట్లు తెలిపారు. అక్కడ కూడా పూజలు చేపట్టి కొద్దిసేపు యువకులతో మాటలు కలిపి సరదాగా అందరిని నవ్వించారు.

మంత్రాలయంలో కర్ణాటక హైకోర్టు జడ్జి

మంత్రాలయం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ హెచ్‌పీ సందేష్ శుక్రవారం రాత్రి మంత్రాలయంకు వచ్చారు. పద్మనాభ వీఐపీ గెస్ట్‌హౌస్ వద్ద ఈయనకు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్ కే శ్రీనివాసరావు, వెంకటేష్‌జోషి, సురేష్ కోణాపూర్, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి ఘనంగా స్వాగతం పలికారు. రాత్రి మంత్రాలయంలోనే బసచేసి శనివారం ఉదయం గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేయనున్నారు. కార్యక్రమంలో మంత్రాలయం సీఐ రామాంజులు, జయతీర్థ ఆచార్, వ్యాసరాజాచార్, ఆంజినేయులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యం ప్రదర్శించండి



విజేతలతో డీఎస్‌డీవో హర్షవర్ధన్

కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు క్రీడానైపుణ్యం ప్రదర్శించాలని జిల్లా అథ్లెటిక్ సంఘం చైర్మన్ హర్షవర్ధన్ తెలిపారు. కర్నూలు డీఎస్‌ఏ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా అథ్లెటిక్ ఎంపిక పోటీలు ప్రారంభమయ్యాయి. క్రీడాకారులు గెలుపు ఓటములు సమానంగా స్వీకరించాలని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తేవాలని సూచించారు. ఏలూరులో ఈ నెల 27, 29 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుననీ తెలిపారు. అనంతరం అండర్-14, 16, 18, 20 విభాగాల్లో విజేతలకు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు మెడల్స్ అందజేశారు. పీఈటీ లక్ష్మయ్య, మల్లేష్, రామచంద్రయ్య, మల్లి, రాజేష్, డీఎస్‌ఏ కోచ్ కాశీరావు పాల్గొన్నారు.

హోంగార్డు నియామక పత్రం అందజేత

కర్నూలు క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతి చెందిన ఓ హోంగార్డు కుటుంబానికి హోం శాఖ అండగా నిలిచింది. దాసరి మునిస్వామి అనే హోంగార్డు ఈ ఏడాది మార్చి 25న అనారోగ్యంతో మృతి చెందాడు. కారుణ్య నియామకం కింద ఆయన కుమారుడు దాసరి పెద్ద స్వామికి హోంగార్డు ఉద్యోగం ఇస్తూ ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా హోంగార్డు నియామక పత్రాన్ని హోంగార్డు కమాండెంట్ మహేష్ కుమార్ శుక్రవారం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ భాస్కర్‌రావు, హోంగార్డు డీఎస్పీ ప్రసాద్, ఆర్ఐ జావీద్‌లు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధం సమర్పణ

● అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు



ఎల్లార్తిలో గంధం తీసుకొస్తున్న సయ్యద్ నూర్ బాబాఖాద్రి

హొళగుంద, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎల్లార్తి షేక్షావలి, షాషా వలి సాహెబ్ ఉరుసులో భాగంగా గురువారం అర్ధరాత్రి భక్తిశ్రద్ధలతో గంధం సమర్పించారు. దర్గా మాజీ ధర్మకర్త రావూఫ్ ఇంటి నుంచి షేక్షావలి, షాషావలి సాహెబ్ వంశస్థులు రాయచూర్‌కు చెందిన సయ్యద్ నూర్ బాబా ఖాద్రి గంధాన్ని తలపై పెట్టుకొని మేళతాళాల మధ్య దివిటీల వెలుగులో దర్గాకు చేరుకున్నారు. గంధాన్ని స్వామి వారికి సమర్పించారు. ముజావర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వేడుకకు తరలివచ్చిన భక్తులతో దర్గా ఆవరణం, పరిసరాలు, కిక్కిరిసిపోయాయి. వివిధ ప్రాంతాల భక్తులు స్వామివారికి చాదర్, చక్కెర, లడ్డు, టెంకాయలను సమర్పించారు. కొంతమంది భక్తులు దర్గా ఆవరణలో కందూరి చేశారు. టీడీపీ నాయకుడు ఈడిగ గోవింద్ గౌడ్, రాజేంద్ర గౌడ్ ఆధ్వర్యంలో దర్గాకు వచ్చే భక్తులకు అన్నదారం చేశారు. ఆలూరు సీఐ రవి శంకర్ రెడ్డి, ఆధ్వర్యంలో ఎస్సై దిలీప్‌కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు. వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ సోహెల్, ఎల్లార్తి ఈవో షేక్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

గ్రీన్ టాక్స్ తగ్గింపు సంతోషదాయకం

అభినందన

ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



ఆళ్లగడ్డ, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ మాట ఇచ్చిన ప్రకారం వాహనదారులకు గ్రీన్ టాక్స్ తగ్గించడం చాలా సంతోషదాయకమని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో ఆమె మాట్లాడారు. ప్రజలందరికి ముఖ్యంగా లారీ ఓనర్‌లకు ఇది ఎంతో ప్రయోజనమన్నారు. గత ప్రభుత్వంలో 200 ఉండే గ్రీన్ టాక్స్‌ను రూ.20 వేలు పెంచడమే కాకుండా వాహనాలు సీజ్ చేయడం, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేదంటూ వారిని ఎన్నో ఇబ్బందులకు గురి చేసేవారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పన్నులు తగ్గించడం ఊరటనిచ్చిందన్నారు. అలాగే మ్యాక్సీ క్యాబ్‌లు, ఆటోలు, బైక్‌లు, ట్రాక్టర్లపై కూడా వైసీపీ ప్రభుత్వం విధించిన పన్నుల పెంపును తమ ప్రభుత్వం తగ్గించారన్నారు. పన్నుల రూపంలో వసూలు చేసిన నిధులను ప్రజల భద్రతకు ఉపయోగించాలని ఆమె కోరారు.


ట్రావెల్స్ బస్సుకు భారీ జరిమానా

● రోడ్డు ట్యాక్స్ కట్టలేదని రూ.4.43 ఫైన్

డోన్ రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): డోన్ ఆర్టీవో కార్యాలయం పరిధిలో రోడ్డు ట్యాక్స్ కట్టకుండా తిరుగుతున్న ట్రావెల్ బస్సుకు ఆర్టీవో అధికారులు భారీ జరిమానా విధించారు. శుక్రవారం డోన్-అమకతాడు హైవే టోల్ ప్లాజా వద్ద తనిఖీ చేస్తుండగా.. తమిళనాడు-సేలం నుంచి హైదరాబాదు వెళ్తున్న ట్రావెల్ బస్సును ఆర్టీవో క్రాంతి కుమార్ తనిఖీలు నిర్వహించారు. రోడ్ ట్యాక్స్ కట్టలేదని గుర్తించి రూ.4.43 లక్షలు జరిమానా విధించినట్లు ఆర్టీవో క్రాంతి కుమార్ తెలిపారు.

ఏడీఏ ఆంజనేయులు కన్నుమూత

● సంతాపం తెలిపిన వ్యవసాయ శాఖ అధికారులు


ఆంజనేయులు (ఫైల్)

నంద్యాల ఎడ్యుకేషన్/ కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని అభివృద్ధి చేసేందుకు నాలుగేళ్లు శ్రమించిన వ్యవసాయ శాఖ ఏడీఏ ఆంజనేయులు శుక్రవారం కర్నూలు నగరంలోని కిమ్స్ హాస్పిటల్‌లో మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం బ్రెయిన్ డెడ్‌తో తుదిశ్వాస విడిచారని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం ఆయన నంద్యాల వ్యవసాయ శాఖ ఏడీఏగా పని చేస్తున్నారు. ఏడీఏ ఆంజనేయులు మృతి చెందిన విషయంతెలుసుకుని ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది ఆయన నివాస గృహానికి చేరుకుని సంతాపం తెలిపారు. బంధువులను ఓదార్చారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తి అరెస్టు

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో ఓ వ్యక్తిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఎస్ఐ మల్లికార్జున తెలిపిన వివరాలివీ.. మండలంలోని 80బన్నూరు గ్రామానికి చెందిన సిమోను అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన ఎల్లయ్య అనే వ్యక్తి ఈనెల 17న కత్తితో దాడి చేశాడు. దీంతో సిమోను పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం 80బన్నూరు జమ్ములమ్మ దేవాలయం వద్ద ఎల్లయ్యను అరెస్టు చేసి అతడి వద్ద కత్తి స్వాధీనం చేసుకున్నారు. నందికొట్కూరు కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు. న్యాయమూర్తి నిందితుడిని రిమాండుకు ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

నిందితుడి అరెస్టు

● గంజాయి మొక్కల స్వాధీనం


గంజాయితో పాటు నిందితుడిని మీడియాకు చూపిస్తున్న పోలీసులు

ఆదోని రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆదోని మండలం కుప్పగల్లుకు చెందిన మర్కట్లు వెంకటేశ్ గంజాయిని సాగు చేస్తూ, దానిని సాధువులకు విక్రయిస్తున్నాడని రూరల్ సీఐ నల్లప్ప తెలిపారు. వెంకటేశ్‌కు మూడున్నర ఎకరాల పొలం ఉంది. ఈ పొలంలో ఈ ఏడాది పత్తి సాగు చేస్తున్నాడు. ఈ పంటలోనే అక్కడక్కడ గంజాయి మొక్కలను కూడ పెంచుతున్నాడు. పోలీసు సిబ్బంది దాడులు నిర్వహించి దాదాపు 4కేజీల గంజాయి మొక్కలతోపాటు నిందితుడిని శుక్రవారం అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో పెద్దతుంబళం ఎస్ఐ మహేశ్ కుమార్, వ్యవసాయాధికారి సుధాకర్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు విద్యార్థులకు తిరిగి ఇవ్వాలి

● ఫీజు బకాయిలు ఉంటే అండర్ టేకింగ్ తీసుకోవాలి

● విద్యా సంస్థలకు ఉప లోకాయుక్త ఆదేశాలు

కర్నూలు లీగల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోర్సులు పూర్తయినా కూడా రీయింబర్స్‌మెంటు పేరుతో విద్యార్థుల సర్టిఫికెట్లను వాపసు చేయకుండా వేధించే విద్యాసంస్థలకు రాష్ట్ర ఉప లోకాయుక్త వార్నింగ్ ఇచ్చింది. రాష్ట్రంలో పలు విద్యాసంస్థలు విద్యార్థుల కోర్సులు పూర్తయినా కూడా ఫీజుల రీయింబర్స్‌మెంటును ప్రభుత్వం మంజూరు చేయడంలో ఆలస్యం కావడంతో పలువురు విద్యార్థులు సర్టిఫికెట్లను కొన్ని విద్యాసంస్థలు తమ వద్దే ఉంచుకుంటున్నాయి. ఈ మేరకు ఆంధ్రజ్యోతి పత్రికలో కథనం రావడంతో రాష్ట్ర ఉప లోకాయుక్త సుమోటాగా కేసు నమోదు చేసి రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల రిజిస్ట్రార్లు, ఉన్నతా విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి సాంకేతిక విద్య డైరెక్టర్లుకు నోటీసులు జారీ చేసింది. ఈ సమస్యపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, విశ్వవిద్యాలయాలు తమ కోర్సు పూర్తయ్యాక విద్యార్థులు ఫీజుల బకాయిలు ఉంటే సదురు బకాయిలకు సంబంధించి అండర్ టేకింగ్‌ను గానీ, బాండ్‌ను గానీ తీసుకుని విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను వెంటనే వాపసు చేయాలని సూచించింది. భవిష్యత్తులో విద్యార్థుల జీవితాలను కాపాడటానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని ఈ ఏడాది డిసెంబరు 8వ తేదీలోగా తమ రిపోర్టును ఉప లోకాయుక్తకు దాఖలు చేయాలని ఉప లోకాయుక్త పి.రజని తమ ఆదేశాలు జారీ చేశారు.

గ్యాస్ లీకేజీతో వ్యాపించిన మంటలు

● ఇద్దరికి గాయాలు

● భయంతో మొదటి అంతస్తు నుంచి దూకిన యువతికి కూడా..


గాయపడ్డ శ్రీనివాసులు

వెల్దుర్తి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్యాస్ లీకేజీ కావడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ శుక్రవారం వెల్దుర్తిలో జరిగింది. వివరాలివీ.. కె.శ్రీనివాసులు వెల్దుర్తిలో డెయిరీ దుకాణం నిర్వహిస్తున్నారు. పాతబస్టాండ్ సమీపంలో ఉన్న మసీదు వెనుక వీధిలో అద్దెకు నివాసం ఉంటున్నారు. సిలిండర్ వద్ద రెగ్యులేటర్ ఆఫ్ చేసినా గ్యాస్ లీకవుతోందని శ్రీనివాసులు గ్యాస్ ఏజెన్సీ వద్దకు వెళ్లి గ్యాస్ డెలివరీ బాయ్‌ను వెంట తీసుకెళ్లారు. సాయంత్రం సమయంలో డెలివరీ బాయ్ రిపేరీ చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించాయి. ఇదేసమయంలో ఇంట్లో ఉన్న శ్రీనివాసులు కూతురు మౌనిక మొదటి అంతస్తు నుంచి కిందకు దూకేసింది. మంటలు వ్యాపించడంతో శ్రీనివాసులు, డెలివరీబాయ్ మధుకు గాయాలు కాగా కిందకు దూకడంతో మౌనిక గాయపడింది. స్థానికులు ముగ్గురిని వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు సర్వజన వైద్యశాలకు తరలించారు.

అప్పుల బాధతో కౌలు రైతు బలవన్మరణం

మంత్రాలయం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళేక ఓ కౌలురైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని కొత్తరాంపురం గ్రామంలో చోటుచేసుకుంది. మృతుడి బంధువులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన వెంకట్రావు(58) సొంతూరు తూర్పు గోదావరి జిల్లా కాకినాడ పట్టణం. ఇరవై ఏళ్ల క్రితం కొత్తరాంపురం గ్రామానికి వలస వచ్చాడు. 20ఎకరాలు కౌలుకు తీసుకుని మిరప, పత్తి, వరి వంటి పంటలు సాగుచేస్తూ జీవనం సాగించేవాడు. ఐదేళ్లుగా పత్తి, మిరప పంటలో తీవ్ర నష్టం వాటిల్లింది. అప్పులు ఎక్కువయ్యాయి. అప్పులు తీర్చే దారిలేక వారంరోజులుగా మదనపడేవాడు. శుక్రవారం పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన 108అంబులెన్స్‌లో ఎమ్మిగనూరు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య రాజేశ్వరి, కొడుకు సుధాకర్, కుమార్తెలు రాధిక, చిన్ని ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రిలో ఉంచారు. ఈవిషయమై మాధవరం ఎస్ఐ విజయ్ కుమార్‌ను వివరణ కోరగా ఆసుపత్రి నుంచి సమాచారం రావాల్సి ఉందన్నారు. మృతుడి బంధువులు ఫిర్యాదుచేస్తే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

ఎర్రమట్టి.. కొల్లగొట్టి..



● కోడుమూరు మండలంలో ఇష్టానుసారంగా తవ్వకాలు

● ప్రభుత్వ ఆదాయానికి గండి ● పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ అధికారులు

అధికార పార్టీ నాయకులు విచ్చలవిడిగా ఎర్రమట్టి దందా చేస్తున్నారు. ఎక్కడ గుట్ట కనిపిస్తే అక్కడ పాగా వేసేస్తున్నారు. నిత్యం వందల సంఖ్య వాహనాల్లో మట్టిని తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. మట్టి తవ్వకాలు చేపట్టాలంటే మైనింగ్ అధికారుల అనుమతులు తప్పని సరిగా ఉండాలి. అయితే కోడుమూరు నియోజకవర్గంలో మాత్రం అవేవీ లెక్క చేయకుండా ఇష్టానుసారంగా తవ్వకాలు చేపడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. అయితే మైనింగ్, రెవెన్యూ అధికారులకు మామూళ్లు ముడుతుండడంతోనే ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారే విమర్శలు ఉన్నాయి.

కోడుమూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కోడుమూరు మండలంలోని గ్రామీణ స్థాయి అధికార పార్టీ నాయకులు కనిపించిన కొండలు, గుట్టలు, చెరువులను కొల్లగొట్టి ఎర్రమట్టిని దోచేస్తున్నారు. మైనింగ్ అధికారుల అనుమతులు లేకుండా ఎర్రమట్టిని అక్రమంగా తరలించి అధికార పార్టీ నాయకులు జేబులు నింపుకొంటున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. కోడుమూరు మండలంలోని బైన్‌దొడ్డి గ్రామానికి సంబంధించిన తిప్పను కొల్లగొట్టి ప్రైవేటు కంపెనీలకు ఎర్రమట్టిని అమ్ముతున్నారు. మండలంలోని గోరంట్ల, క్రిష్టాపురం, పులకుర్తి, వెంకటగిరి గ్రామాలోని ఏర్పాటు చేసిన విద్యుత్తుని తయారు చేసే గాలిమర యంత్రాల రహదారుల కోసం పెద్ద ఎత్తున మట్టి అవసరం. ఆ కంపెనీకి సంబంధించిన కొంత మంది గ్రామీణ ప్రాంతాల్లోని అధికార పార్టీ నాయకులను ఆశ్రయిస్తున్నారు. మాకు అవసరమైన ఎర్రమట్టిని అందిస్తే మట్టి తరలింపుకు ఖర్చులతో పాటు కమీషన్ ఇస్తామని నాయకులకు డబ్బు ఎరవేస్తున్నారు. ఒక టిప్పర్ ఎర్రమట్టికి రూ.5వేలు ఇస్తూ నాయకులకు కమీషన్ కూడా అందిస్తున్నారు. దీని కారణంగా మండలంలో ఎర్రమట్టికి డిమాండ్ ఏర్పడింది. దీంతో గ్రామీణ స్థాయిలోని అధికార పార్టీ నాయకులే మాఫియా అవతారం ఎత్తి ఎర్రమట్టిని కొల్లగొడుతున్నారు. బైన్‌దొడ్డి తిప్ప నుంచి ఎర్రమట్టిని తరలించడాన్ని బైన్‌దొడ్డి ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. నాయకులు మట్టిని తరలించి పొలాలకు వెళ్లే రహదారులను నాశనం చేస్తున్నారు. క్రిష్టాపురంలోని ఒక టీడీపీ నాయకుడు కృష్ణగిరి మండల పరిధిలోని ఒక పొలాన్ని కొనుగోలు చేశాడు. పొలాన్ని తవ్వి అందులోని ఎర్రమట్టిని క్రిష్టాపరం గ్రామం చుట్టూ ఉన్న గాలిమర యాంత్రాలకు రహదారులకు తరలిస్తున్నాడు. గోరంట్ల గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడు ఒక కాంట్రాక్టర్‌తో ఒప్పందం కుదుర్చుకొని చిల్లబండ కొండ నుంచి ఎర్రమట్టిని తరలిస్తున్నారు.

● ఈ విషయంపై పార్టీ సీనియర్ నాయకుడు డి.విష్ణువర్ధన్‌రెడ్డి ఆయా గ్రామీణ స్థాయి నాయకులను హెచ్చరించారు. అయినప్పటికీ హెచ్చరికలను పట్టించకోకుండా ఎర్రమట్టిని యథేచ్ఛగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

అనుమతులు లేవు

బైన్‌దొడ్డి తిప్ప నుంచి ఎర్రమట్టిని తరలించడానికి ఎలాంటి అనుమతులు లేవు. ఇంతకు ముందే ఎర్రమట్టి తరలింపును అడ్డుకున్నాం. మైనింగ్ అధికారుల అనుమతి ఉంటేనే మట్టిని తరలించాలి. లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకొంటాం.

● నాగరాజు, తహసీల్దార్, కోడుమూరు.

అక్రమార్కులతో చేతులు కలిపిన అధికారులు

మండలంలో ఎర్రమట్టి తరలిపోతున్నా అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు దారి తీస్తోంది. అక్రమార్కులతో మైనింగ్, రెవెన్యూ అధికారులు చేతులు కలపడంతోనే అధికార పార్టీ నాయకులు రెచ్చిపోయి ఎర్రమట్టిని అమ్ముకొంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆదాయ వనరులను కాపాడాల్సిన అధికారులు చూసిచూడనట్టు వ్యవహరించడం అనుమానాలకు బలం చేకూరుతోంది. ఇప్పటికైన అధికారులు ఎర్రమట్టి కూడా అక్రమ తరలింపును అడ్డుకొని ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాలని ప్రజలు కోరుతున్నారు.


కృష్ణగిరి మండలంలో పొలాన్ని తవ్వేసిన క్రిష్టాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు

సమస్యలు పరిష్కరించే దాకా పోరాటం


విద్యుత్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న ఉద్యోగులు

కల్లూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం చేసే వరకు పోరాటం కొనసాగుతుందని కర్నూలు జేఏసీ చైర్మన్ సతీష్‌కుమార్ చెప్పారు. శుక్రవారం ఏపీ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో కర్నూలు సర్కిల్ ఆఫీసు ముందు రెండ్రోజుల రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు, ఎనర్జీ అసిస్టెంట్లు పెద్దఎత్తున హాజరయ్యారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 22వ తేదిన జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ కార్యాలయం వరకు చేపట్టనున్న శాంతియుత ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గతంలో ప్రభుత్వం అంగీకరించిన అంశాలన్ని అమలు చేయాలని, లేనిపక్షంలో జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శివకుమార్, బెళగల్ హుసేనీ, కె.పెద్దయ్య, ఎం.నాగేశేషులు, భాస్కర్, సురేష్, దామ్లనాయక్, సీఎం ప్రసాద్, నాగమల్లేశ్వరరావు, రామరాజు, కృష్ణయ్య, ఆనంద్ దేవపాల్ తదితరులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వారికి జైలు, జరిమానా


ఎస్సీ ఎస్టీ కేసులో జైలు శిక్ష పడిన ఒకే కుటుంబానికి చెందిన నిందితులు

కర్నూలు లీగల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తలను కులం పేరుతో దూషించి దాడి చేసిన కేసులో ఒకే కుటుంబానికి చెందన ఐదుగురికి 9 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ కర్నూలు ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు న్యాయాధికారి పి.వాసు శుక్రవారం తీర్పు చెప్పారు. కర్నూలు వీకర్‌సెక్షన్ కాలనీకి చెందిన ఫిర్యాది సుగాలి గోవిందమ్మ అదే వీధికి చెందిన నిందితులు మురుగునీరు పారద్రోలే విషయంపై 2018 మే 17వ తేదీన ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో నిందితులు శ్రీనివాసులు, సరోజ, జ్యోతి, రాజు, వెంకటేష్ ఫిర్యాదిపై దాడి చేసి కులం పేరుతో దూషించారు. దీంతో ఫిర్యాది భర్త అడ్డురాగా, ఆయనపై కూడా దాడి చేశారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ వినోద్ కుమార్ నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టులో నిందితులపై నేరం రుజువు కావడంతో వారికి 9 సంవత్సరాల జైలు శిక్ష మొదటి నిందితుడు శ్రీనివాసులుకు రూ.25వేలు జరిమానా, మిగతా నిందితులకు జైలు శిక్షతో పాటు రూ.2వేలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు.

విభాగాల్లో స్కానింగ్ టోకెన్లు ఇవ్వాలి

● కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్

● హెచ్‌వోడీలతో సమీక్ష


మాట్లాడుతున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అల్ట్రాసౌండ్ స్కానింగ్‌కు సంబంధించిన టోకెన్లను సంబందించిన విభాగాల్లోనే రోగులకు అందజేస్తామని స్కానింగ్ టోకెన్ ఇవ్వాలంటే తప్పనిసరిగా ప్రొఫెసర్ సంతకం ఉండాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు హెచ్‌వోడీలను ఆదేశించారు. రోగులకు స్కానింగ్‌పరీక్షలు అవసరమైతేనే రాయాలని హెచ్‌వోడీలను ఆదేశించారు. కర్నూలు మెడికల్ కాలేజీ కాన్ఫరెన్స్ హాలులో ప్రిన్సిపల్ డా.కే.చిట్టినరసమ్మ, సీఎస్ఆర్ఎంవో డా.వెంకటరమణతో కలిసి ఆయన వివిధ హెచ్‌వోడీలతో సమీక్ష నిర్వహించారు. హౌస్ సర్జన్లు రోగ నిర్ధారణ పరీక్షలు రాయవద్దని సీనియర్ పీజీ విద్యార్థి మాత్రమే పరీక్షలు రాయాలని ఆదేశించారు. క్యాజువాలీటీలో రోగులను త్వరగా సంబంధిత వార్డులకు షిఫ్ట్ చేయాలని, వారం రోజులు గడువు ఇచ్చి పరిశీలిస్తాననీ, రోగుల పరిస్థితి అలాగే ఉంటే దీని నిర్వహణను ఎమర్జెన్సీ విభాగానికి అప్పగిస్తామన్నారు. చిన్న పిల్లల విభాగంలో సీజనల్ వ్యాధుల వల్ల రోగుల సంఖ్య పెరిగిందని, దీనికి తగ్గట్లుగా ఆక్సిజన్ సరఫరా పెంచాలని వైద్యులు సూపరింటెండెంట్ దృష్టికి తెచ్చారు. కొత్త కలెక్టర్‌కు వైద్య ఆరోగ్య శాఖపై పట్టు ఉందని, కావున వైద్యులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూపరింటెండెంట్ సూచించారు. ప్లాస్టిక్, సర్జరీ ఎస్ఐసీయూ సర్జరీ యూనిట్‌లో అదనపు పడకలు పెంచాలని సూపరింటెండెంట్‌ను కోరారు. హాస్పిటల్‌లో కొత్తగా తిరుపతికి చెందిన శానిటేషన్‌కు పద్మావతి పెర్టిలిటీ, సెక్యూరిటీ ఏజెన్సీకి ఈగల్ హంటల్ ఏజెన్సీలకు ప్రభుత్వం కొత్తగా కాంట్రాక్టు ఇచ్చిందన్నారు. సమీక్షలో అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డా.పద్మజ, వివిధ విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. బాలుడి మృతి

ఆస్పరి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరుమాన్‌దొడ్డి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందాడు. కౌతాళం మండలం బదినేహాల్ గ్రామానికి చెందిన డ్రైవర్ రుకలి మారుతి, తిమ్మప్ప ఆస్పరిలో టమోటా కొనుగోలు చేసుకుని పల్లెల్లో అమ్మేవారు. శుక్రవారం ఆదోని నుంచి ఆస్పరికి వస్తున్న ఆటో స్టీరింగ్ విరగి బోల్తా పడింది. ఆ ఆటోలు ప్రయాణిస్తున్న బదినేహాల్‌కు చెందిన రమేశ్, జయమ్మ దంపతులు కుమారుడు మల్లికార్జున అలియాస్ పులిమున్నా(15) తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పరి పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోనికి తరలించారు. సీఐ గంగాధర్ ఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకుంటాం

● డీఈవో శామ్యూల్‌పాల్


నవోదయ కోచింగ్ సెంటర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డీఈవో శామ్యూల్‌పాల్

ఎమ్మిగనూరు టౌన్/ గోనెగండ్ల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్న నవోదయ కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకుంటామని డీఈవో శామ్యూల్‌పాల్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని గీతానగర్, వీవర్స్ కాలనీ, గుడికల్ రోడ్డు, ఎల్ఐసీ ఆఫీస్ దగ్గర, లక్ష్మీపేట, ఆదోని రోడ్డులో గల కోచింగ్ సెంటర్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా కొన్నేళ్లుగా వీరు కోచింగ్ సెంటర్లను నిర్వహిస్తున్నారన్నారు. ఇక్కడ చదువుతున్న పిల్లల పేర్లు ప్రైవేట్ స్కూళ్లలో, కొంతమంది పేర్లు గవర్నమెంట్ పాఠశాలలో ఉన్నాయన్నారు. ప్రైవేట్, గవర్నమెంట్ పాఠశాలలపై కూడా కచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు.

మోడల్ స్కూల్ సిబ్బందిపై డీఈవో ఆగ్రహం

గోనెగండ్ల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్ పరిసరాలను అపరిశుభ్రంగా ఉంచిన సిబ్బందిపై డీఈవో ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం ఉదయం జిల్లా మోడల్ స్కూల్ కన్వీనర్ ఈరన్నరెడ్డి, మధ్యాహ్నం డీఈవో వేర్వేరుగా పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈరన్నరెడ్డి మాట్లాడుతూ పాఠశాలలోని గదుల్లో పాములు, తేళ్లు తిరుగుతున్నట్లు విచారణలో తేలిందన్నారు. పాముకాటుకు గురైన స్వీపర్ కృష్ణవేణమ్మతో డీఈవో మాట్లాడారు. తనకు పాము కరిచిందని వైద్యం చేయించుకున్నానని, ప్రస్తుతం ఆరోగ్యం బాగుందని ఆమె డీఈవోకు తెలిపారు.

పెద్దకొట్టాలలో ఇరువర్గాల ఘర్షణ

● ఇంటికి నిప్పు పెట్టిన ఓ వర్గం


పెద్ద కొట్టాలలో పూర్తిగా కాలిపోయిన చిన్నబాబు ఇల్లు

నంద్యాల టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకొట్టాల గ్రామంలో ఇరువర్గాల మధ్య గురువారం అర్ధరాత్రి ఘర్షణ జరిగింది. తాలుకా పోలీసులు తెలిపిన వివరాలివీ.. పెద్ద కొట్టాలలో అదే గ్రామానికి చెందిన పుల్లయ్య, చిన్నబాబు మధ్య రెండు నెలల క్రితం ఘర్షణ జరిగింది. గ్రామంలోని పెద్ద మనషుల సమక్షంలో పంచాయితీ చేశారు. చిన్నబాబు కొన్నిరోజుల పాటు ఊర్లో ఉండవద్దని తీర్మానించారు. ఫంక్షన్ ఉందని చెప్పి చిన్నబాబు గురువారం గ్రామానికి వచ్చాడు. అయితే విషయం తెలుసుకున్న పుల్లయ్య గురువారం రాత్రి చిన్నబాబు ఇంటి మీదకు వెళ్లి గొడవ పెట్టుకుని అతడి ఇంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఘర్షణలో గాయపడ్డ ఇరువర్గాల వారిని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇరువర్గాల వారు తాలుకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై విచారిస్తున్నామని సీఐ ఈశ్వరయ్య తెలిపారు.

సెక్యూరిటీ ఏజెన్సీ వివాదానికి తెర

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సెక్యూరిటీ ఏజెన్సీ నిర్వహణ వివాదానికి తెరపడింది. రెండు నెలల నుంచి నెలకొన్న సెక్యూరిటీ విధులు ఎవరూ చేపడుతారో హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లుకు ఈగల్ హంటల్ సొల్యూషన్స్ కంపెనీ ప్రతినిధులు శుక్రవారం సాయంత్రం చర్చించి క్లారిటీ ఇచ్చారు. అనంతరం సెక్యూరిటీ ఆఫీసులో రాత్రి ఈగల్ హంటల్ కంపెనీ ఏపీ ఆపరేషన్ మేనేజర్ శంకర్, స్టేట్‌కోఆర్డినేటర్ సాయినివాస్ విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సెక్యూరిటీ విధులను తామే నిర్వహిస్తామని తాము ఎవరికి సబ్ కాంట్రాక్టు ఇవ్వలేదని, వదంతులను ఎవరూ నమ్మవద్దని వివరించారు.

నాణ్యమైన విద్యను అందించాలి: డీఈవో

బండిఆత్మకూరు సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలని డీఈవో జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం బండిఆత్మకూరులోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. ముందుగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం నేరుగా విద్యార్థుల మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అలాగే రికార్డులను తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్ రఫిక్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నాం

● వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త ధార సుధీర్

నందికొట్కూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నామని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త ధార సుధీర్ అన్నారు. శుక్రవారం వైసీపీ నాయకులు చలో మెడికల్ కళాశాలకు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా నంద్యాలకు వెళ్తున్న నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో పాటు, కర్నూలులో బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని హౌస్ అరెస్టు చేయడంతో వైసీపీ నాయకులు పట్టణంలోని పటేల్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్, నాయకులు పుల్యాల నాగిరెడ్డి, రమేష్‌నాయుడు, మద్దిలేటి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వంతెన నిర్మించాలి

కొత్తపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివపురం-లింగాపురం గ్రామాల మధ్య ఉన్న ఎద్దులేరు వాగుపై వంతెన నిర్మించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు, ఏఐఎస్‌ఏ రాష్ట్ర కార్యదర్శి నాగార్జున డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ఉమారాణికి, ఎంపీడీవో మేరీలకు అందజేశారు. కార్యక్రమంలో గాబ్రియేల్, పామన్న, సీలన్న, సుధాకర్, మేకల శేఖర్, సోమప్ప, అబ్దుల్లా, మహబూబ్ బాషా, లక్ష్మీదేవి, ముర్తుజాబి, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్పీలపై విచారణ

నంద్యాల టౌన్ సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై పట్టణంలోని సీఆర్పీలపై శుక్రవారం మెప్మా అధికారులు విచారణ చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో వీరందరు ఏకపక్షంగా వ్యవహరించినట్లు సమాచారం. ఇదిలా ఉంటే సీఆర్పీలు మాత్రం సీఎంఎం శోభారాణి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, తాము కొనసాగాలంటే ఒక్కొక్కరు రూ.2లక్షలు ఇవ్వాలని అడిగినట్లు విచారణ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా విచారణ అధికారులు జిలాని, మురళి, సరళమణి మాట్లాడుతూ పట్టణంలో 134మంది సీఆర్పీలు ఉన్నారని, గతంలో వీరు చేసిన అక్రమాల ఆధారంగా విచారణ చేపట్టినట్లు తెలిపారు. సీఆర్పీలు, సీఎంఎం వివరాలను నమోదు చేసుకున్నామన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు.

సౌత్ జోన్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థిని ఎంపిక

పాణ్యం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సౌత్ జోన్ జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు శాంతిరామ్ ఇంజనీరింగ్ విద్యార్థిని వైష్ణవి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం క్రీడాకారిణి వైష్ణవిని కళాశాల ఎండీ శివరామ్, హెచ్‌వోడీ మల్లికార్జునరావు, పీడీ చంద్రారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈనెల 18న అనంతపురం జేఎన్‌టీయూ పరిధిలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ కనబరిచారన్నారు. చెన్నై సెంట్రల్ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో క్రీడాకారిణి పాల్గొంటారన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంగారు అంగళ్ల వీధిలోని హజరత్ జమాల్‌బాషా వలి రహ్ దర్గాలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఉరుసు నిర్వహించారు. నంద్యాల జిల్లా టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ హాజరుకాగా, దర్గా పీఠాధిపతులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన పూజలు చేశారు. కార్యక్రమంలో ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మనియార్ ఖలీల్ అహ్మద్, దర్గాకమిటీ సభ్యులు, చౌక్ మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా బైరెడ్డి జన్మదిన వేడుకలు



నందికొట్కూరులో బ్రెడ్లు, పండ్లు అందిస్తున్న టీడీపీ నాయకులు

నందికొట్కూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పలు వార్డుల్లో టీడీపీ నాయకులు, బైరెడ్డి అభిమానులు మహిళలకు చీరలను పంపిణీ చేశారు. నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతలకు పండ్లు, బ్రెడ్లులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పల్లె రఘురామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్ లాలుప్రసాద్, టీడీపీ నాయకులు బంగారు వెంకటేశ్వర్లు, అబ్దుల్ శుకూర్ పాల్గొన్నారు.

పగిడ్యాల: మండల పరిధిలోని ప్రాతకోట గ్రామంలో టీడీపీ నాయకుడు , మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకలు శుక్ర వారం నిర్వహించారు. టీడీపీ నాయకులు అల్లీవుసేన్, అజీమ్‌ల ఆధ్వ ర్యంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పాములపాడు : మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి జన్మదిన వేడుకలను మండల టీడీపీ యువ నాయకుడు జిల్లా టెలికాం అడ్వైజర్ కురువ రమేశ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నీటిసంఘం వైస్ ప్రెసిడెంట్ కురువ వెంకటేశ్వర్లుతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియచేశారు. కార్యకర్తలు నారాయణ, అన్వర్, వెంకటస్వామి, వెంకటేశ్వర్లు, మల్లి, అశోక్, శివ, నాగస్వామి అభిమానులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: టీడీపీ సీనియర్ నాయకుడు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆ పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం బైరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని టీడీపీ నాయకులు కేవీ శివారెడ్డి, సుబ్బరాయుడు, మున్నా ఆధ్వర్యంలో కొలనుభారతిలోని సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం కరివేనా దగ్గరలోని మానవతా వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేశారు. నాయకులు గోపాల్‌రెడ్డి, చాంద్‌బాషా, పుల్లన్న, నారాయణ, నాయుడు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి జన్మదినం టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కేకును కట్‌చేసి కార్యకర్తలు, విద్యార్థులకు మిఠాయిలు అందజేశారు.



ప్రాతకోటలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

'ఉపాధి'లక్ష్యాలను అధిగమించాలి

● డ్వామా పీడీ సూర్యనారాయణ

పాణ్యం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధి లక్ష్యాలను అధిగమించాలని డ్వామా పీడీ సూర్యనారాయణ సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 2025-26 సంవత్సరానికి లేబర్ బడ్జెట్ రూ. 2.84 లక్షలకు 65 శాతం మాత్రమే లక్ష్యం సాధించారన్నారు. పండ్ల తోటలకు సంబంధించి 110 ఎకరాలకు 82 ఎకరాలు మాత్రమే పూర్తి చేసినట్లు తెలిపారు. హౌసింగ్ 90 రోజుల మ్యాండేట్‌కు సంబంధించి లబ్ధిదారులకు స్టేజీల వారిగా పేమెంట్లు ఇవ్వాలని, మండలంలో 2014 కంపోస్టు గుంతలు తీయాల్సిఉండగా 296 మాత్రమే అనుమతులు తీసుకున్నారన్నారు. వంద రోజులు పని చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఏపీవో శేషన్న, ఈసీ శివారెడ్డి, టీఏలు ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, ఉమామహేశ్వరి, కంప్యూటర్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పనుల పరిశీలన

మిడుతూరు: మండల పరిధిలోని తలముడిపి, రోళ్లపాడు గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను శుక్రవారం ప్రాజెక్టు డైరెక్టర్ సూర్య నారాయణ పరిశీలించారు. గ్రామా ల్లో ఉపాధి పనులను వేగవంతం చేసి, రైతులకు పండ్ల తోటల పెంపకం పంట్ల అవగాహన కల్పించాలన్నారు. మండలానికి ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయాలని ఉపాధి సిబ్బందికి ఆయన సూచించారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో దశరథరామయ్య, ఏపీవో నాగమ్మ, ఈసీ షబానా, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ సూర్యనారాయణ

సోలార్ వాహనాల అడ్డగింత



రైతులు, సీపీఎం నాయకులతో మాట్లాడుతున్న అధికారులు

పాణ్యం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పిన్నాపురం పరిధిలోని గ్రీన్‌కో నిర్వహిస్తున్న సోలార్ నిర్మాణ పనులను శుక్రవారం రైతులు, పశుకాపరులు అడ్డుకున్నారు. సీపీఎం ఆధ్వర్యంలో పనులను జరగకుండా వాహనాలను నిలిపివేశారు. దీంతో పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సోలార్ నిర్వాహకులు, సీపీఎం నాయకులతో చర్చించారు. రైతు సంఘం నాయకులు రామచంద్రుడు మాట్లాడుతూ రైతులు, గొర్రెలు, మేకల పెంపకందారులు కోరినట్లు తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని సుమారు 52 ఎకరాల భూమిని కేటాయించాలని, నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ప్రకటించాలని, భూములు కోల్పోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అధికారులందరూ ఈనెల 23న పిన్నాపురంలో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నిర్ణయించారని వివరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, ఏపీ రైతు సంఘం నాయకులు రామచంద్రుడు, సీఐటీయూ కార్యదర్శి భాస్కర్, తిమ్మాపురం గ్రామ రైతులు రమేష్, మాసుమయ్య, నారాయణ, కిట్టప్ప, రైతులు పాల్గొన్నారు.

బార్‌ను ఏర్పాటు చేయొద్దు



ధర్నా చేస్తున్న సలీం నగర్ వాసులు

నంద్యాల టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పద్మావ తి నగర్ ఆనుకుని ఉన్న సలీంనగర్‌లో బార్‌ను ఏర్పాటు చేయొద్దని, వెంటనే అనుమతులను రద్దు చేయాలని ఆ ప్రాంత పెద్దలు కోరారు. శుక్రవారం పట్టణంలోని నాలుగు మసీదుల పెద్దలు, ముస్లింలు ప్రార్థనల అనంతరం మౌలానా అబుల్ కలాం అజాద్ సర్కిల్ వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశా రు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల పెద్దలు మహ్మద్ సమీవుల్లా, నూర్ బాషా, అబులైస్ మాట్లాడుతూ.. తమ ప్రాంతంలో మసీదులు, పాఠశాలలు, ఆసుపత్రులు ఉన్నాయని నిత్యం రద్దీ ఉంటుందన్నారు. ప్రశాంత వాతావరణాన్ని భంగం కలిగించడం సరికాదన్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు వెంటనే బార్ అనుమతులు రద్దు చేయాలని డిమాండు చేశారు. లేనిపక్షంలో నిరసనలు వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో చింపింగ్ బాసిత్, మౌలాలి, సర్దార్, ఇక్బాల్, ముస్లింలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

● గ్రామ రెవెన్యూ సేవకుల నిరసన

గోస్పాడు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కీలకంగా పనిచేస్తున్న వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ షేక్ మొహిద్దీన్‌కు వీర్ఏలు వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 20న ఆర్డీవో కార్యాలయం ముం దు, 22న కలెక్టరేట్ ముందు ధర్నా చేయనున్నట్లు తెలిపారు. వీఆర్ఏలు నాగరాజు, బాబయ్య, నాగేశ్వరరావు, పుల్లయ్య, రంగయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పద్మావతినగర్‌లో ఉన్న ఇండోర్ స్టేడియంలో శుక్రవారం జరిగిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికలు నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లానుంచి దాదాపు 170మంది బాల, బాలికలు పోటీల్లో పాల్గొన్నారు. బాల, బాలికలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. గురుఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ మౌలాలిరెడ్డి, స్కూల్‌గేమ్ కార్యదర్శులు బీహెచ్ విశ్వనాథ్, ఆశాజ్యోతి, డీఎస్‌డీవో ఎంఎస్‌వీరాజు, ఎల్‌కేఆర్ ప్రిన్సిపాల్ నాగకోటేశ్వరరావు పాల్గొన్నారు.

సమాజ ఉన్నతికి గురువుల పాత్ర కీలకం

మహానంది, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సమాజ ఉన్నతికి గురువుల పాత్ర కీలకమని మండల విద్యాశాఖాధికారి రామసుబ్బయ్య అన్నారు. ఎం.తిమ్మాపురంలోని ఆదర్శపాఠశాల ఉపాధ్యాయుడు సయ్యద్ సలీం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకోవడంతో శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈవో రామసుబ్బయ్య మాట్లాడుతూ నేటి విద్యార్థులే భావి తరానికి మార్గనిర్దేశకులు అని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

కొత్తపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఐటీడీఏ ప్రాజెక్టు మేనేజర్ కేజీ నాయక్ కోరారు. శుక్రవారం మండలంలోని శివపురం గ్రామ పంచాయతీలో ఉన్న శివపురం చెంచుగూడెంలో గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను, తరగతి గదులను పరిశీలించారు. ఉపాధ్యాయులు బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. ఆయన వెంట హెచ్ఎం వీర న్న, ఐటీడీఏ ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో రాజునాయక్, ఉపాధ్యాయులు ఉన్నారు.

యూరియా అందేలా చర్యలు: తహసీల్దారు

పగిడ్యాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతులకు యూరియా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ శివరాముడు, ఏవో మురళీధర్ తెలిపారు. మండల పరిధిలోని నెహ్రూనగర్, ముచ్చుమర్రి రైతు భరోసా కేంద్రాలకు మంజూరైన యూరియా పంపిణీని శుక్రవారం వారు పరిశీలించారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

'విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం దుర్మార్గం'

నందికొట్కూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుర్థులపై లాఠీచార్జీ చేయడం దుర్మార్గమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వర్‌రావు ఖండించారు. శుక్రవారం నందికొట్కూరు పార్టీ కార్యాలయంలో సీపీఎం నాయకులు స్వాములు, గోపాలకృష్ణలతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎందుకు ప్రైవేటు పరం చేస్తున్నారని ప్రశ్నిస్తే లాఠీ చార్జీ చేస్తారా అని ప్రశ్నించారు. ప్రైవేటీకరణ ఆపకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

రామకృష్ణ డిగ్రీ కాలేజీలో 'టీబీ ముక్త్‌భారత్'

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జిల్లా క్షయనివారణ అధికారి ఎం.శారదాబాయి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల అధినేత డా.జి.రామకృష్ణారెడ్డి నిక్షయ్ మిత్రగా నమోదు చేసుకొని 20మంది క్షయవ్యాధిగ్రస్తులకు ఆరునెలలపాటు పోషకాహారకిట్లు ఇచ్చేందుకు దత్తత తీసుకున్నారు. మొదటి విడతగా పోషకాహార కిట్లను పంపిణీచేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బయ్య, డీఎస్ఎంఓ డా.టి.తేజస్విని, పీపీఎంఎస్ నాగార్జునరెడ్డి, టీబీక్లినిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏడీఏ మృతికి నివాళి

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నంద్యాల వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆంజనేయులు కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. ఆయన మృతికి పలువురు నివాళి అర్పించారు. పత్తికొండ నియోజకవర్గం దేవనకొండ మండలం పొట్టిపాడు గ్రామానికి చెందిన ఆంజనేయులు ఇటీవలే నంద్యాలకు బదిలీపై వచ్చారు. ఏడీఏ మృతిపై వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది విచారం వ్యక్తం చేస్తూ వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆత్మకూరులో దుకాణాలు బంద్

ఆత్మకూరు: బదిలీపై వెళ్లిన ఏడీఏ ఆంజనేయులు అనారోగ్యంతో మృతి చెందడంతో ఆత్మకూరులోని ఎరువులు, పురుగు మందులు, విత్తన దుకాణాదారులు తమ దుకాణాలను బంద్ చేసి సంతాపం వ్యక్తం చేశారు. ఆత్మకూరు ఏడీఏ హేమలత, మండలాల ఏవోలు, వ్యవసాయ సిబ్బంది, పలువురు ఆయన మృతదేహానికి నివాళి అర్పించారు.

ఘనంగా మహానందీశ్వరుడి పల్లకీ సేవ

మహానంది, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలను ప్రత్యేక పల్లకీలో ఆశీనులు గావించారు. వేదమంత్రాలతో ప్రత్యేక పూజలను జరిపారు. అనంతరం భక్తుల శివ నామస్మరణ మధ్య ఆలయ ప్రాంగణలో పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి పర్యవేక్షకుడు పసుపుల సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ చేయాల్సిందే

మిడుతూరు, సెప్టెంబరు 19:(ఆంధ్రజ్యోతి): ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించాలని ఆత్మకూరు డివిజనల్ లెవెల్ అభివృద్ధి అధికారి అన్వర్ బేగం అన్నారు. శుక్రవారం నాగలూటి గ్రామంలోని చెత్తసేకరణ షెడ్డును ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో దశరథరామయ్య, డిప్యూటీ ఎంపీడీవో ఎంపీడీవో సంజన్న, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలకు పరిహారమివ్వాలి

ఆత్మకూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలతో దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆ సంఘం మండల మహాసభను నిర్వహించారు. అనంతరం ఏపీ రైతు సంఘం ఆత్మకూరు మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాబాషా, ఉపాధ్యక్షులుగా రాముడు, రామచంద్రుడు, మహెబూబ్‌బాషాగా, ప్రధాన కార్యదర్శిగా వీరన్న, సహాయ కార్యదర్శి కృష్ణమోహన్, నాగన్న, అష్రఫ్ అలి, కిరణ్‌కుమార్, సభ్యులను ఎన్నుకున్నారు.

'డిమాండ్లను నెరవేర్చాలి'

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లకు నెరవేర్చాలని ఏపీజేఏసీ ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల కన్వీనర్ లక్ష్మీకాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా చైర్మన్ వినుకొండ కృపావరం, మహేశ్వర్‌రెడ్డి , ఎడిఈ రామయ్య, శ్రీరాములు, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో అధ్యాపకుడి మృతి



వెంకటయ్య

కొత్తపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కెరంచ గ్రామంలో గుండెపోటుతో అధ్యాపకుడు వెంకటయ్య మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కలుబండి వెంకటయ్య (49) నంద్యాల పాలిటెక్నిక్ కళాశాలలో కాంట్రాక్టు అధ్యాపకుడిగా విధులు నిర్వహించేవారు. శుక్రవారం చాతి నొప్పిలో అక్కడికక్కడే కుప్పకూలి పోయాడు. గమ నించిన కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. విషయం తెలుసుకుని తోటి అధ్యాపకులు మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి భార్యకు ఉద్యోగం కల్పించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు.

డాక్యుమెంట్ రైటర్ల నిరసన

ఆత్మకూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు సబ్ రిజిస్ట్రర్ కార్యాలయ పరిధిలోని దస్తావేజు లేఖరులు శుక్రవారం పెన్‌డౌన్ నిరసన వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన పలు విధానాలను వ్యతిరేకిస్తూ నిరసనలు తెలుపుతున్నట్లు వారు వివరించారు. కాగా దస్తావేజు లేఖరుల నిరసనలతో ఆత్మకూరు రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లకు అంతరాయం ఏర్పడింది.

బకాయిలు చెల్లించాలి

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పీఆర్సీ కమిటీని నియమించి, బకాయిలు చెల్లించాలని, బోధనేతర కార్యక్రమాలు రద్దు చేయాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రణభేరి యాత్ర శుక్రవారం నంద్యాలకు చేరింది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ఎదురుగా బహిరంగ సభ నిర్వహించారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్, జిల్లా యూటీఎఫ్ అధ్యక్ష,కార్యదర్శులు ప్రసాద్, జే.సుధాకర్, రామ్మోహన్, సోమయ్య, మల్లికార్జునప్ప, ఏకేసుజాత, షమీంబాను, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ



కలెక్టర్‌కు పూలమొక్కను అందజేస్తున్న ఎస్పీ

నంద్యాల టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ రాజకుమారిని నూతన ఎస్పీ సునీల్ షెరాన్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ పూలమొక్కను అందజేశారు. పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతలు కాపాడేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. ఇందుకు ప్రజలు కూడా సహకరించాలని తెలిపారు.

నేడు 'స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర'

నంద్యాల టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో స్వర్ణాంధ్ర..స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని మూడో శనివారం సందర్భంగా నిర్వహిస్తున్నట్లు కమిషనర్ బండి శేషన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా వీవీ నగర్‌లోని డబ్బింగ్ యార్డులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. మంత్రి ఎన్ఎండీ ఫరూక్, చైర్‌పర్సన్ మాబున్నీసా, కలెక్టర్ రాజకుమారి పాల్గొంటారని తెలిపారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

పాణ్యం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల దోపిడీలు అధికమయ్యాయని సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా సెక్యూరిటీ అధికారి మేజర్ సుభాష్ శర్మ సూచించారు. శుక్రవారం స్టేట్ బ్యాంకులో బ్రాంచి మేనేజరు అంజన్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బందికి, వినియోగదారులకు అవగాహన నిర్వహించారు. మాక్‌డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో ఎస్ఐ నరేంద్ర కుమార్‌రెడ్డి, బ్యాంకు సిబ్బంది , వినియోగదారులు పాల్గొన్నారు.

యూరియా అందిస్తాం

బండిఆత్మకూరు సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతులందరికీ యూరియా అందిస్తామని కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కలెక్టర్ రాజకుమారితో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి చర్చించారని, ఒకటి రెండు రోజుల్లో యూరియా పూర్తిస్థాయిలో ఆర్ఎస్‌కేలకు, సొసైటీలకు, ఎరువుల దుకాణాలకు చేరుతుందన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

ఆలయాల హుండీ లెక్కింపు

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ఆలయాల హుండీలను శుక్రవారం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, ఈవో లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో లెక్కించారు. గుడిపాటిగడ్డలో వెలసిన లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలోని హుండీని లెక్కించగా రూ.2,05,034లు, మల్లికార్జునస్వామి ఆలయ హుండీ ద్వారా రూ.75,332లు, చిత్తలూరి వారి వీధిలోని శ్రీకృష్ణ భజనమందిరంలోని హుండీని లెక్కించగా రూ.11,222లు వచ్చినట్లు ఈవో తెలిపారు. హుండీ లెక్కింపులో భక్తులు, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

పీఎఫ్‌ను ఖాతాల్లో జమ చేయాలి

నంద్యాల టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఉపాధ్యాయుల పీఎఫ్‌ను వ్యక్తి గత ఖాతా ల్లో జమ చేయాలని మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దస్తగిరి, నాగేషు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పురపాలక కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అలాగే పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో వరప్రసాద్‌రెడ్డి, సభ్యులు శివకుమార్, రవికుమార్, ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాప్రయోజనాల కోసమే కృషి

నంద్యాల నూనెపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఆదాయం తగ్గుతున్నా ప్రజా ప్రయోజనాల కోసమే కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజును పురస్కరించుకొని చేస్తున్న బీజేపీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా మూడో రోజు పట్టణంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు రమేశ్ ఆధ్వర్యంలో మహానందిశ్వరస్వామి ఆలయ పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో నాయకులు కొశెట్టి చంద్రశేఖర్, పసుపుల సాయి, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

గోస్పాడు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఏపీవో గంగన్న సూచించారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ వలంటీర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఏపీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అక్షరాస్యులు కావాలనే సంకల్పంతో ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. మండలంలో ఇప్పటివరకు 1370మంది మహిళా నిరక్షరాస్యులను గుర్తించామన్నారు. గ్రామాల్లో వీరికి అక్షరాభ్యాసం చేయించేందుకు వలంటీర్లను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వయోజన విద్య సూపర్‌వైజర్ షేక్‌ఫయాజ్, వెలుగు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పాముకాటుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పాముకాటు అవగాహన దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఆర్.వెంకటరమణ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఇంటిచుట్టూ చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో యాంటీ స్నేక్ వీనం ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు సుదర్శన్‌బాబు, అషరఫ్‌అలి, శ్రీజ, ప్రసన్నలక్ష్మి, భరత్‌కుమార్, మోడిరమేష్, రవీంద్రనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో శంకర్‌ప్రసాద్

చాగలమర్రి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలని నంద్యాల డిప్యూటీ డీఈవో శంకరప్రసాద్ అన్నారు. శుక్రవారం చాగలమర్రి సేయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థి అలిఅక్బర్‌ను ఓ టీచర్ కర్రతో కొట్టిన విషయంపై విచారణ చేశారు. ఉపాధ్యాయులు, పది విద్యార్థులు తల్లిదండ్రులతో విచారణ నిర్వహించారు. డిప్యూటీ డీఈవో మాట్లాడూతు విద్యా ర్థులను కర్రలతో కొట్టకూడదని అన్నారు. విచారణ నివేదికలను ఆర్ జేడీకీ పంపిస్తామన్నారు. ఆయన వెంట హెచ్ఎం స్మిత, ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల ఉన్నారు.

కట్టెల ట్రాక్టర్ బోల్తా



బోల్తాపడిన కట్టెల ట్రాక్టర్

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శాంతినగర్‌లో బొరుగుల బట్టీ వద్ద చెక్కల ట్రాక్టర్ బోల్తాపడింది. అయితే ఆ సమయంలో సమీపంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లయింది. బనగానపల్లె నుంచి కట్టెలు (చెక్కలు) లోడుతో కొలిమిగుండ్ల బొరుగుల బట్టి వద్దకు వచ్చిన ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. నిత్యం చిన్న పిల్లలు, ప్రజలు తిరిగే వీధిలో బొరుగుల బట్టి వద్ద ట్రాక్టరు రివర్స్ చేస్తున్న సమయంలో బోల్తాపడింది. దీంతో ట్రాక్టరులోని చెక్కలు మొత్తం రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

డాక్యుమెంట్ రైటర్ల సమ్మె



సమ్మె చేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

కోవెలకుంట్ల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల పట్టణంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్లు సమ్మె చేపట్టారు. నాయకులు ఆదేశాల మేరకు శుక్ర, శనివారాలు సమ్మె చేపట్టినట్లు రైటర్లు పుల్లన్న, చిన్నమోహన్ రావు, నారాయ ణరెడ్డి, జలీల్, బాలముని తెలిపారు. గతంలో రిజిస్టర్లు ఓటీపీతో సంబంధం లేకుండా భూములు, ఇళ్ల రిజిస్ట్రేషన్లు జరుగుతుండేవన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఆధార్ లింకుతో ఓటీపీ ఆధారంగా రిజిస్ట్రేషన్ చేయించాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. దీని వల్ల కొంత మేర ఇబ్బం దులు కలుగుతున్నాయని, వీటిని తొలగించి పాత పద్ధతిలోనే రిజిస్ట్రేషన్లు జరిపించాలని సమ్మె చేశామని తెలిపారు.

రూ.2 కోట్లతో పెట్నీకోట రహదారి పనులు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నాబార్డు నిధులు కింద రూ.2కోట్లతో కొలిమిగుండ్ల నుంచి పెట్నీకోట సమీపం వరకు రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు ఏఈ శ్రీకాంతరెడ్డి తెలిపారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి ఆదేశాల మేరకు రోడ్డు నిర్మాణా పనులు త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు.

డ్రైవర్లకు లైసెన్స్ తప్పనిసరి: సీఐ

కోవెలకుంట్ల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలని కోవెలకుంట్ల సీఐ హనుమంతనాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని జమ్మలమడుగు వెళ్లే రహదారిలో సీఐ వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లైసెన్సు, సర్టిఫికెట్లు, హెల్మెట్లు ధరించని వారికి జరిమానా విధించారు. సీఐ మాట్లాడుతూ డ్రైవర్లు తగినంత వేగంతో వాహనాలు నడిపి ప్రమాదాలు నివారించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు.

నేడు 'స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర'కు హాజరు కానున్న ఎమ్మెల్యే

డోన్ టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబస్టాండులో శనివారం ఉదయం 10 గంటలకు జరిగే స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి హాజరు కానున్నారని పార్టీ నాయకులు తెలిపారు. పట్టణం లోని బాలికల ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపడు తారని తెలిపారు. ఈకార్యక్రమానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

చాగలమర్రి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని స్థానిక కేరళ వైద్యశాల సమీపంలో దివంగత మాజీ ముఖ్య మంత్రి నందమూరి తారకరామారావు విగ్రహం ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని కేటాయించాలని గ్రామ టీడీపీ అధ్యక్షుడు మౌళాలి, మైనార్టీసెల్ నాయకుడు కొలిమి ఉసేన్‌వలి, కొలిమి షరిఫ్ పంచా యతీ ఈవో తారకేశ్వరికి వినతి పత్రం అందజేశారు.

నిబంధనలు గాలికి..

- మెడికల్ షాపుల్లో కానరాని ఫార్మాసిస్టులు
- డాక్టర్ల చీటీ లేకుండానే మందుల అమ్మకాలు
- రోజు లక్షల్లో వ్యాపారాలు
- జీఎస్టీ చెల్లించని నిర్వాహకులు
- కొరవడిన పర్యవేక్షణ

అవుకు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మెడికల్ షాపుల యజమానులు నిబంధనలు గాలికొదిలేశారు. పట్టణంలోని మెడికల్ షాపుల నిర్వాహకులు కొందరు రోగుల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు. ఇక్కడ అమ్మిన మందులకు బిల్లులు ఇవ్వరు. రోగులకు విక్రయించిన మాత్రలు వికటిస్తే తమకు సంబంధం లేదని జారుకుంటారు. రోజు లక్షల్లో వ్యాపారం జరుగుతున్నా వ్యాపారులు జీఎస్టీ చెల్లించకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. మెడికల్ షాపులను బీఫార్మసీ పూర్తి చేసిన రిజిస్టర్ ఫార్మాసిస్టులు మాత్రమే నిర్వహించాల్సి ఉంటుంది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే రోగులకు మందులు విక్రయించాలి. నిషేధిత, నాణ్యత లేని, కాలం చెల్లిన, శాంపిల్స్ మందులను కొన్ని మెడికల్ షాపుల్లో యథేచ్ఛగా అమ్మకాలు సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. షాపుల నిర్వాహకులు సిండికేట్‌గా ఏర్పడి ప్రతి నెల మా మూళ్లను ఔషధ నియంత్రణ అధికారులకు ముట్ట చెపుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో షాపులపై ఏరియా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణ కొరవడింది. నిర్వాహకులు ఇష్టానుసారంగా చెలరేగిపోతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.




అడ్డదారిలో అనుమతులు పొంది..

కొందరు వ్యక్తులు ఫార్మాసిస్టు సర్టిఫికెట్‌లను అద్దెకు తీసుకొని అడ్డదారిలో అనుమతులు పొంది మెడికల్ షాపుల నిర్వహణ సాగిస్తున్నారు. సాధారణంగా జనరల్, జనరిక్స్, కౌంటర్ ప్రొడక్ట్ మూడు రకాల ఒరిజనల్ కంపెనీలకు చెందిన మాత్రల ద్వార రోగులకు నష్టం ఉండదు. నిర్వాహకులు అధిక కమీషన్ల కోసం ఆశపడి వీటి స్థానంలో ఇతర కంపెనీలకు చెందిన నాణ్యత లేని మాత్రలను విక్రయిస్తూ అధిక లాభాలను గడిస్తున్నారు. డాక్టర్లు రోగుల యొక్క రోగ తీవ్రత, వయస్సు ల్యాబ్ రిపోర్టు ఆధారంగా ప్రిస్క్రిప్షన్‌లో మందులను రాసిస్తారు. నిర్వాహకులు ఆ మందులనే రోగులకు అందించాలి. డాక్టరు రాసిన మందులు లేకపోతే రోగుల నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకొని వాటికి బదులుగా మరొక కంపెనీ మందులను అంటగడుతున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

షాపుల నిర్వాహకులు మండలంలోని ప్రైవేట్ డాక్టర్లకు, గ్రామాల్లోని దుకాణాదారులకు హోల్ సేల్‌గా మందులను విక్రయిస్తూ జేబులను నింపుకుంటున్నారు. మెడికల్ షాపుల్లో రోజు లక్షల్లో టర్నోవర్ జరుగుతుంది. కంప్యూటర్ బిల్లు ఒక్క షాపులో కూడా దొరకని పరిస్థితి నెలకొంది. షాపుల్లో తక్కువ వ్యాపారం జరుగుతున్నట్లు అధికారులకు తప్పుడు లెక్కలు చూపుతూ జీఎస్టీ చెల్లించకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. కచ్చితంగా బిల్లులు కావాలని అడిగిన వారికి మరుసటి రోజు వచ్చి బిల్లు తీసుకోవాలని చెబుతారు. ఆ బిల్లులో ఫార్మాసిస్టు సంతకం చేయాల్సి ఉన్న చోట, ఫార్మాసిస్టు సర్టిఫికెట్‌లను అద్దెకు తీసుకొని షాపును నడుపుతున్న వ్యాపారులే సంతకం చేసి, డాక్టరు పేరు మార్చి, జీఎస్టీ లేని మ్యానువల్ బిల్లులను ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు.



మెడికల్ షాపుల్లో జీఎస్టీ లేకుండా మ్యానువల్‌గా ఇస్తున్న బిల్లు, ప్రైవేట్ డాక్టరు రాసిన మందుల చీటీపైనే వేసి ఇస్తున్న బిల్లు

మామూళ్లు అందజేస్తూ...

పట్టణంలోని మెడికల్ షాపుల వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ప్రతి నెల ఔషధ నియంత్రణ అధికారులకు మామూళ్లు ముట్టచెబుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. దాదాపు నాలుగేళ్లుగా మెడికల్ షాపులపై డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు దాడులు చేసిన దాఖలాలు లేవని విమర్శలున్నాయి. గత నెల చివరిలో నంద్యాలలో అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లతో కలసి మెడికల్ ఏజెన్సీ, షాపుల నిర్వాహకులకు నార్కోటిక్ డ్రగ్స్, యాంటీ బయోటిక్ వినియోగంపై అవగాహన సదస్సును నిర్వహించారు. అయినా మెడికల్ షాపుల నిర్వాహకుల్లో మార్పులేదు.

నాణ్యత లేని మందులను..

పట్టణంలోని మెడికల్ షాపులపై ఔషధ నియంత్రణ అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. దీన్ని ఆసరాగా తీసుకొని నిర్వాహకులు యథేచ్ఛగా బిల్లులు ఇవ్వకుండ, నాణ్యతలేని మందులను రోగులకు విక్రయించి జేబులు నింపుకుంటున్నారు.

● నీలి రామచంద్రుడు, అవుకు

త్వరలో తనిఖీలు చేపడతాం

నెల రోజుల క్రితమే బదిలీపై వచ్చాను. కర్నూలు రూరల్ పరిధిలోకి వచ్చే మెడికల్ షాపులపై దృష్టిసారించాం. అక్రమాలకు పాల్పడే మెడికల్ షాపులపై చర్యలు తప్పవు. త్వరలో మెడికల్ షాపుల్లో తనిఖీలు చేపడతాం.

● జయరాముడు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్

సురవరం మృతి పార్టీకి తీరని లోటు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామచంద్రయ్య



మాట్లాడుతున్న రామచంద్రయ్య

డోన్ రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పార్లమెంటు మాజీ సభ్యుడు సురవరం సుధాకర్ రెడ్డి మృతి సీపీఐకి తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామచంద్రయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని షాదీఖానాలో సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామచంద్రయ్య మాట్లాడుతూ సురవరం సుధాకర్ రెడ్డి పార్టీకి చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, రాధాకృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, వెంకట నాయు నిపల్లె, టీడీపీ నాయకుడు శ్రీనివాసులు యాదవ్ పాల్గొన్నారు.

నరసాపురంలో వైద్య శిబిరం

రుద్రవరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసా పురం గ్రామంలో ఓ మహిళకు ఈనెల 14న నంద్యాల ప్రభుత్వాసు పత్రిలో డెంగీ పాజిటివ్ వచ్చింది. ఈ నెల 18న డిశ్చార్జి చేశారు. దీంతో మండలంలోని నరసాపురం గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారి బాబు తెలిపారు. కాలనీలో బ్లీచింగ్ పౌడరు, సున్నం చల్లించారు. డ్రైనేజీలో దోమల నివారణ మందు స్ప్రే చేయించారు. వైద్యాధికారి మాట్లాడుతూ కాలనీలో జ్వరం కేసులు రాగా వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. వైద్య పరీక్షలు చేయగా నెగిటివ్ వచ్చిందని తెలిపారు. చుట్టుపక్కల 55 ఇళ్లల్లో స్ప్రే చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీ డీవో సుబ్రహ్మణ్యం, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శివచంద్రా రెడ్డి, ఎంపీ హెచ్‌వో నాగప్రసాద్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వ్యవసాయ సాగులో మెలకువలు పాటించాలి

డోన్ రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సాగులో మెలకువలు పాటించాలని డోన్ వ్యవసాయ ఏడీఏ సునీత, యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ధనలక్ష్మి, సుధాకర్, రమణయ్య, బాల్‌రాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని మార్కెట్ యార్డులో మండలంలోని దేవరబండ, ఎద్దుపెంట, కోట్రాయి, గుమ్మకొండ, వెంకటాపురం, కామగాని గుంట్ల రైతులకు వేరుశనగ సాగులో మెలకువలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డోన్ మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి, ప్యాపిలి, బేతంచెర్ల ఏవోలు, వ్యవసాయ విస్తరణాధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన

డోన్ రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉడుములపాడు గ్రామ సచివాలయంలో వాహనమిత్ర దరఖాస్తుల స్వీకరణలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని డోన్ ఆర్డీవో క్రాంతి కుమార్ శుక్రవారం పరిశీలించారు. సచివాలయంలో దరఖాస్తుల స్వీకరణకు సంబంధించి పలు సూచనలు చేశారు.

అంటరానితనాన్ని నిర్మూలిద్దాం: సీఐ

ప్యాపిలి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అంటరానితనాన్ని నిర్మూలిద్దామని సీఐ వెంకటరామిరెడ్డి అన్నారు. మండలంలోని పీఆర్ పల్లిలో ఆయన గ్రామస్థులతో సమావేశాన్ని నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ గ్రామస్థులంతా కలసి మెలసి జీవించాలన్నారు. గ్రామంలో రెండు గ్లాసుల పద్ధతికి దూరంగా ఉండాలన్నారు. జలదుర్గం ఎస్ఐ నాగార్జున, ఎమ్మార్పీఎస్ నాయకులు సుందరం, రామక్రిష్ణ పాల్గొన్నారు.

22 నుంచి దసరా ఉత్సవాలు

కోవెలకుంట్ల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఈ నెల 22 నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభమవుతాయని కోవెలకుంట్ల పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శన మిస్తారు. ఈనెల 22న రాజరాజేశ్వరిదేవి అలంకారం, 23న శ్రీకా త్యాయనిదేవిగా, 24న శ్రీఅన్నపూర్ణదేవిగా, 25న బాలా త్రిపురసుందరీదేవిగా, 26న ధనలక్ష్మీదేవిగా, 27న శ్రీనాగలక్ష్మీదేవిగా, 28న శ్రీగజలక్ష్మీదేవిగా, 29న బిందెసేవ శ్రీసరస్వతిదేవిగా, 30న శ్రీమహిషాసుర మర్ధినిదేవిగా, అక్టోబరు 1న కామాక్షిదేవిగా, 2న వి జయలక్ష్మీదేవి అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తారు. 2న గ్రామోత్సవం, 3న వసంతాలు, తులాభారం, తోటోత్సవం నిర్వహిస్తామన్నారు.

కొలిమిగుండ్ల: మండలంలోని పేట్నీకోట గ్రామంలోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 22వ తేదీ నుంచి దేవీ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు గిరి స్వామి శుక్రవారం తెలిపారు. కాశీవిశేశ్వర అన్నపూర్ణదేవి భక్తులకు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తుందన్నారు.

'స్వచ్ఛతాహి సేవ'లో భాగస్వాములు కావాలి

కోవెలకుంట్ల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతాహి సేవలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఎంఈవో వెంకట సుబ్బయ్య, డిప్యూటీ ఎంపీడీవో ప్రకాశ్‌నాయుడు అన్నారు. శుక్రవారం కోవెల కుంట్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'స్వచ్ఛతాహి సేవ'లో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంఈవో వెంకట సుబ్బయ్య, డిప్యూటీ ఎంపీడీవో ప్రకాశ్‌నాయుడు హాజరై మాట్లాడారు. విద్యార్థులు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామలింగారెడ్డి, మద్దిలేటి స్వామి పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

బేతంచెర్ల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యశాలలో స్వాస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం కింద మహిళలకు ఈనెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు నిర్వహించే వైద్యశిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని బేతంచెర్ల పీహెచ్‌సీ ప్రభుత్వ వైద్యురాలు డా.సాగరిక కోరారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ సాగరిక ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈశిబిరంలో మహిళలు, చిన్న పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్ డాక్టర్ శబరీష్, ఆర్థోపెడిక్ డా.గౌస్ అహ్మద్, సైకాలజిస్టు డా.మృదుల, జనరల్ సర్జరీ డా.ఇర్ఫాన్, డెంటల్ సర్జరీ డా.వెంకటేశ్, ఈఎన్‌టీ డా.ప్రసాద్, చిన్నపిల్లల వైద్య రాలు డా.స్వప్న, వాణి ప్రియ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

డోన్ టౌన్: స్వాస్థ్ నారీ సశక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆయురేద్వ డిస్పెన్సరీ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నగర మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు హాజరయ్యారు. మహిళలు, కిషోర బాలికలకు వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు డా.గ్రేస్ సెలస్టియల్, డా. మాధవి,



డోన్‌లో విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

డా.రాజారావు, డా.అతావుర్ రెహిమాన్, సిబ్బంది పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల బీజేపీ అధ్యక్షుడు లోకేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ జయంతిని పురస్కరించుకుని సేవా పక్వాడ కార్యక్రమాలు సెప్టెంబరు 17వ తేదీ నుంచి అక్టోబరు 2 వరకు వైద్య, రక్తదాన శిబిరాలు, మేధావులతో సమావేశాలు నిర్వహిస్తున్నా మన్నారు. ఈ శిబిరంలో అన్ని రకాల వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న వీఆర్‌ఏలు, సీఐటీయూ నాయకులు

ప్యాపిలి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి చిన్న రహిమాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల పరిష్కారానికి వీఆర్‌ఏలు చేపట్టిన రిలేదీక్షలకు సీఐటీయూ మద్దతు ప్రకటించింది. రహిమాన్ మాట్లాడుతూ వీఆర్‌ఏల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అనంతరం వీఆర్‌ఏలతో కలిసి సీఐటీయూ నాయకులు తహసీల్దారు భారతికి వినతిపత్రం అందజేశారు. వీఆర్‌ఏలు, సీఐటీయూ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

శిరివెళ్ల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప అన్నారు. శిరివెళ్లలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆయన క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం జూడో పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులను గుర్రప్ప, హెచ్ఎం గోవిందరాజ అభినందించారు. కార్యక్రమంలో పీడీ షేక్షావలి, ఉపాధ్యాయులు ఉదయ్ ప్రేమ్ కుమార్, జయరాం, జాఫర్, రబ్బాని, కృష్ణారావు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు ఏర్పాటుకు స్థల పరిశీలన

అవుకు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అవుకు పోలీస్ స్టేషన్ ఆవరణలో పెట్రోల్ బంకు ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించినట్లు డోన్ ఆర్డీవో నరసింహులు తెలిపారు. శుక్రవారం బనగానపల్లె సీఐ మంజునాథరెడ్డి, ఎస్ఐ రాజారెడ్డి అవుకు రెవెన్యూ కార్యాలయానికి చేరుకొని ఆర్డీవోతో సమావేశమయ్యారు. ఆర్డీవో మాట్లాడుతూ ప్రభుత్వం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో పెట్రోల్‌బంకును నిర్వహించేందుకు అను మతులు మంజూరు చేసిందన్నారు. అందులో భాగంగా స్థలాన్ని పరి శీలించామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, ఆర్ఐ వెంగళరెడ్డి, సర్వేయర్ హరికృష్ణ, వీఆర్‌వో హైదర్‌బాషా పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అందించే ఎన్ఎంఎంఎస్ ప్రతిభ పరీక్షకు 8వ తరగతి చదివే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కొలిమిగుండ్ల ఎంఈవో అబ్దుల్‌క లాం సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభు త్వం నిర్వహించే ఈ పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిస్తే నాలు గేళ్ల పాటు ప్రతి ఏడాది రూ.12వేల చొప్పున ఉపకార వేతనం లభి స్తుందని తెలిపారు.

జనసేన కార్యకర్త మృతికి నివాళి

శిరివెళ్ల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన శిరివెళ్లకు చెందిన జనసేన కార్యకర్త శివారెడ్డి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ పార్టీ నాయకులు శుక్రవారం నివాళి అర్పించారు. జనసేన నాయకులు ఇరిగెల ప్రతాప్‌రెడ్డి, పసుల నరేంద్ర శివారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి సంతాపం వ్యక్తం చేశారు.

వైసీపీ హయాంలో 17 మెడికల్ కళాశాలలు ఏర్పాటు: జడ్పీటీసీ

బేతంచెర్ల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేదల ఉన్నత విద్య కోసం రాష్ట్రంలో 17 కళాశాలలను ఏర్పాటు చేసింది టీడీపీ నాయకులకు కూటమి ప్రభుత్వానికి కనిపించడం లేదా అని డోన్ జడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, బేతంచెర్ల జడ్పీటీసీ శివలక్ష్మి, ఆమె భర్త రామకృష్ణ ప్రశ్నించారు. శుక్రవారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో విలేక రుల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. అసెంబ్లీ సమావేశంలో రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగపూడి అనిత చేసిన వ్యాఖ్యలు అవాస్తవమైనవన్నీ, 17 మెడికల్ కళాశాలలో గత ప్రభుత్వంలోనే మం జూరై నిర్మాణాలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో నాయకులు వంశీ, చిరంజీవి, జయ చంద్రారెడ్డి, రఘునాథ్ రెడ్డి, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

వరద బాధితులకు కిట్లు పంపిణీ

చాగలమర్రి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలంపాడు గ్రామంలో వరద బాధితులకు శుక్రవారం నిత్యావసర కిట్లను టీడీపీ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డిలు పంపిణీ చేశారు. గృహాల్లోకి నీరు ప్రవేశించిన బాధిత కుటుంబాలకు కిట్లు అందజేశారు. మాజీ సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, టీడీపీ నాయకుడు లక్ష్మీరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

శరన్నవరాత్రుల పుస్తకాల ఆవిష్కరణ

చాగలమర్రి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామం లోని చెన్నకేశవ ఆలయంలో దసరా ఉత్సవాల సందర్భంగా శుక్రవా రం శరన్నవరాత్రుల పుస్తకాలను ఆలయ కమిటీ సభ్యులు వేణు గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ నెల 22 నుంచి 3వ తేదీ వరకు దసరా ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

చాగలమర్రి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కురుస్తున్న వర్షాలకు రైతులు జాగ్రత్తలు పాటించాలని ఆళ్లగడ్డ ఉద్యానశాఖ అధికారి దస్తగిరి అన్నారు. బుధవారం 'నష్టాల ఉల్లి' అన్న శీర్షిక ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. దీంతో చిన్నవంగలి గ్రామంలో దెబ్బతిన్న ఉల్లి పంటను ఉద్యానశాఖ అధికారి దస్తగిరి పరిశీలించారు. ఆయన వెంట వీహెచ్‌ఏ ఫరూక్, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన వారికి సన్మానం

దొర్నిపాడు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొర్నిపాడు గ్రామానికి చెందిన నలుగురు విద్యార్థులు డీఎస్సీ ఫలితాల్లో అర్హత సాధించి ఉపాధ్యాయులుగా ఎంపిక కావడంతో శుక్రవారం దొర్నిపాడు అంకాలమ్మ గుడి ఆవరణలో యాదవ సంఘం నాయకులు ఆధ్వర్యంలో సన్మానించారు. యాదవ సంఘం కమిటీ సభ్యుడు ఉసేని మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో కీలకమైందన్నారు.

జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మనాయునిపేట గ్రామానికి చెందిన ఆకాంక్ష ఫౌండేషన్ విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనపరిచారు. కర్నూలు జిల్లాలో జరిగిన అండర్ - 16 క్రీడా పోటీల్లో శాలిని, లక్ష్మీశాంతి, అనిత ప్రతిభ కనపరచి మొదటి స్థానంలో నిలిచారు. అండర్ - 14 క్రీడల్లో యక్షశ్రీ, అవంతిరాణి, రాహుల్ ప్రతిభ కనపరిచి మొదటి స్థానంలో నిలిచారు.

మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించాలి

సంజామల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించాలని సంజామల పీహెచ్‌సీ డాక్టర్ కృష్ణకుమారి అన్నారు. శుక్రవారం ముదిగేడు, ఆల్వకొండ, ముక్కమళ్ల, కమ లపురి, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో మెడికల్ ఆఫీసర్స్ శివశంకర్‌తో కలిసి నారీ శక్తి పరివార్ అభియాన్ వైద్యశిబిరాలను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో రక్త పరీక్ష, గళ్ల, స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. సీహెచ్‌వో సూపర్‌వైజర్ పుల్లయ్య, నారాయణదాస్, తేజ పాల్గొన్నారు.

పూల తోటల సాగుకు ప్రోత్సాహం



రైతుతో మాట్లాడుతున్న అంబుడ్స్ పర్సన్ సురేంద్ర

శిరివెళ్ల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పూలు, పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు ప్రోత్సాహం అందిస్తోందని ఎన్ఆర్ఈజీఎస్ అంబుడ్స్‌పర్సన్ సురేంద్ర తెలిపారు. మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో ఉపాధి నిధులతో రైతు చంద్రగిరి రాజ్‌కుమార్ సాగు చేసిన మల్లెతోటను ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం శిరివెళ్ల మజరా గ్రామమైన వెంకటేశ్వరాపురంలో ఉపాధి కూలీలతో సమావేశమై పని దినాలు, వేతనాల చెల్లింపులపై చర్చించారు. ఆయన వెంట ఏపీవో రామసుబ్బయ్య, టీఏ బాలకృష్ణ, ఎఫ్ఏలు ఆసిఫ్ బాషా, నారాయణ ఉన్నారు.